సంపుటి : 10
సంచిక : 39
గురువారం
05 నవంబర్ 2026
పేజీలు : 12
వెల : 2/-

E-PAPER

విశ్వంవాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE



Contact For Ads:
7579339999

ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో
ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డికి

ఈడీ కస్టడీ



విజయవాడ, నవంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ మద్యం రవాణా కుంభకోణం కేసులో దర్యాప్తు ముమ్మరమైంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డిని రెండు రోజుల పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీకి అనుమతిస్తూ నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో అధికారులు మిగతా .. 2లో..

ఈనెల 23న మేయర్లు, ఛైర్‌పర్సన్ల

ప్రమాణ స్వీకారం : ఎస్ఈసీ




అమరావతి, నవంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ : ఏపీలోని 13 కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీల్లో ఎన్నికల ఫలితాలు తేలడంతో మేయర్లు, ఛైర్‌పర్సన్ల ప్రమాణ స్వీకారానికి రాష్ట్ర ఎన్నికల సంఘం ముహూర్తం ఖరారు చేసింది. ఈనెల 23న మేయర్లు, ఛైర్‌పర్సన్ల ప్రమాణ స్వీకారం ఉంటుందని పేర్కొంది. డిప్యూటీ మేయర్లు, వైస్ ఛైర్‌పర్సన్‌ల ఎన్నికపై రాష్ట్ర ఎన్నికల మిగతా .. 2లో..

విజయవాడ మేయర్‌గా

వంగవీటి రాధా ఘనవిజయం

- మేయర్‌గా అవకాశం కల్పించిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు ధన్యవాదాలు
- తన గెలుపు కోసం కీలకనేని చిన్ని, ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రాధా



విజయవాడ, నవంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ : విజయవాడ నగర మేయర్‌గా జనసేన నేత, కూటమి అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణ ఘన విజయం సాధించారు. వైసీపీ అభ్యర్థి, మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మిపై రాధా మిగతా .. 2లో..

తిరుమలలో గణనీయంగా

తగ్గిన భక్తుల సందడి



తిరుమల, నవంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ : తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ గణనీయంగా తగ్గింది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని మెజారిటీ కంపార్ట్‌మెంట్లు ప్రస్తుతం ఖాళీగా కనిపిస్తున్నాయి. బుధవారం ఉదయం సమయానికి సర్వదర్శనం కోసం భక్తులు కేవలం 4 కంపార్ట్‌మెంట్లలో మాత్రమే వేచి ఉన్నారు. ఉదయం 9:35 గంటల ప్రాంతంలో తిరుమలకు చేరుకున్న భక్తులు క్యూ కాంప్లెక్స్‌లో మిగతా .. 2లో..



- నందన్ నీలేకని నేతృత్వంలోని హై పవర్డ్ టాస్క్ ఫోర్స్ బృందంతో సీఎం చంద్రబాబు భేటీ
- అన్ని రాష్ట్రాల ఏకాభిప్రాయంతో సంస్కరణలు చేపట్టాలని సీఎం సూచన
- విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేలా పరీక్షల విధానం ఉండాలన్న మంత్రి లోకేశ్
- పరీక్షల నిర్వహణలో సాంకేతికత వినియోగంపై దృష్టి సారించామన్న నీలేకని
- ఏపీలో అమలవుతున్న టెక్నాలజీ విధానాలపై టాస్క్ ఫోర్స్ ఆసక్తి

అమరావతి, నవంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ : భారతదేశంలోని విభిన్న రాష్ట్రాలు, విభిన్న భాషల నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా జాతీయ పరీక్షా సంస్కరణలు ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను గౌరవిస్తూ, ఏకాభిప్రాయంతో అత్యంత పారదర్శకమైన, విశ్వసనీయమైన జాతీయ పరీక్షా విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. దేశంలో ఏ ప్రాంతానికి చెందిన విద్యార్థికైనా, ఏ భాష మాట్లాడే వారికైనా న్యాయం జరిగేలా ఈ సంస్కరణలు రూపుదిద్దుకోవాలని ఆయన ఆకాంక్షించారు. బుధవారం అమరావతి సచివాలయంలో మిగతా .. 2లో..



'మురసు' తుపాను ప్రభావిత ప్రాంతాల్లో

సీఎం ఏరియల్ సర్వే

- తుపాను ప్రభావిత గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో సీఎం ఏరియల్ సర్వే
- కరవు పరిస్థితులపై కేంద్ర బృందంతో చంద్రబాబు సమీక్ష
- రాష్ట్రంలో 388 మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించిన ప్రభుత్వం
- ఉపాధి హామీ పనిదినాలను 200 రోజులకు పెంచాలని కేంద్రానికి వినతి
- ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానించాలని విజ్ఞప్తి




అమరావతి, నవంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం రాష్ట్రంలోని రెండు ప్రధాన సమస్యలపై దృష్టి సారించారు. ఒకవైపు 'మురసు' తుపానుతో దెబ్బతిన్న జిల్లాల్లో ఏరియల్ సర్వే నిర్వహించగా, మరోవైపు తీవ్ర కరవు పరిస్థితులపై కేంద్ర బృందంతో సమీక్షా సమావేశం జరిపారు. రాష్ట్రంలో విభిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. తుపాను కారణంగా ప్రభావితమైన గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో సీఎం ఏరియల్ సర్వే నిర్వహించారు. కారంచేడు, కొత్తపట్నం, చీరాల, చిలకలూరిపేట, పర్చూరు వంటి ప్రాంతాల్లోని ముంపు నీటిని వెంటనే తొలగించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రహదారులకు అంతరాయం కలగకుండా మాదాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. మరోవైపు, ఏలూరు జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో భారీ వర్షాలు కొనసాగుతున్నాయని, కొన్నిచోట్ల చిన్న నీటివాగులు చెరువులు పొంగిపొర్లుతున్నాయని అధికారులు సీఎంకు వివరించారు. అనంతరం, రాష్ట్రంలో కరవు పరిస్థితులను అంచనా వేయడానికి వచ్చిన అంతర్-మంత్రిత్వ కేంద్ర బృందం సభ్యులతో చంద్రబాబు సమావేశమయ్యారు. నవంబర్ 2, 3 తేదీల్లో కర్నూలు, నంద్యాల, అనంతపురం, మిగతా .. 2లో..

ఏపీలో ఎంపీటీసీ, జడ్పీటీసీ

ఎన్నికలకు సర్వం సిద్ధం

ఏపీలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు రేపే - ఎన్నికలపై ఎస్ఈసీ సమీక్ష.. కీలక ఆదేశాలు
అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశం : ఎస్ఈసీ పునేఠా



విజయవాడ, నవంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. రాష్ట్రంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పోలింగ్‌కు పెద్దగా ఇబ్బందులు ఉండబోవని ఆయన తెలిపారు. బుధవారం విజయవాడలో జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరపాలని, ఇందుకోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ఓటర్లకు, సిబ్బందికి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల మిగతా .. 2లో..

వరుస తుపాన్ల నేపథ్యంలో

సీఎం చంద్రబాబుకు ఫోన్ చేసిన ప్రధాని మోదీ

రాష్ట్రానికి జరిగిన నష్టం, రైతుల ఇబ్బందులను ప్రధానికి వివరించిన ముఖ్యమంత్రి
'మురసు' తుపాన్ వల్ల రూ.343.95 కోట్ల ప్రాథమిక నష్టం వాటిల్లిందని వెల్లడి
మొత్తం నష్టంలో 94 శాతం వ్యవసాయ రంగంలోనే జరిగిందని కేంద్రానికి నివేదన
రాష్ట్ర ప్రభుత్వ సహాయక చర్యలను ప్రశంసించిన ప్రధాని మోదీ



అమరావతి, నవంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ : వరుస తుపాన్లతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు అండగా నిలుస్తామని కేంద్రం భరోసా ఇచ్చింది. వారం రోజుల వ్యవధిలో 'అర్తల్', 'మురసు' తుపాన్లు రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ నేడు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫోన్ చేసి తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తుపాన్ల ప్రభావం, వాటి వల్ల జరిగిన నష్టం గురించి మిగతా .. 2లో..

పోలవరం-బనకచర్ల లింక్‌పై

రేవంత్ సర్కార్ ద్వంద్వ వైఖరి

తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



తెలంగాణా, నవంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ : పోలవరం – బనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నదీ జలాల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన విధానం లేదని, ఈ విషయం ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశంలో మరోసారి బహిర్గతమైందని ఆమె విమర్శించారు. ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశాల్లో రాష్ట్ర అధికారులు గోదావరి – కావేరి నదుల అనుసంధానాన్ని సమ్మక్క సాగర్ నుంచి చేపట్టాలని కోరుతుంటే... మరోవైపు కేంద్ర హోంమంత్రి అధ్యక్షతన జరిగిన దక్షిణాది రాష్ట్రాల కౌన్సిల్

సదర్‌ను అధికారికంగా రాష్ట్ర పండుగగా ప్రకటించిన

తెలంగాణా ప్రభుత్వం

సదర్ వేడుకల్లో సీఎం రేవంత్.. యాదవులకు కీలక హామీలు
వేడుకల నిర్వహణకు రూ.5 కోట్ల నిధులు కేటాయింపు
హైదరాబాద్‌లోని గోల్కొండ ఒకనాటి గొల్లకొండ అని రేవంత్ వ్యాఖ్య



హైదరాబాద్, నవంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ : సదర్ సమ్మేళనం కేవలం యాదవ సోదరుల పండుగే కాదని, అది తెలంగాణ ప్రజలందరి ఆత్మగౌరవ సమ్మేళనమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించిన సదర్ ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై యాదవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యాదవుల చిరకాల కోరికను నెరవేరుస్తూ.. సదర్ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా అధికారికంగా ప్రకటిస్తున్నట్లు సీఎం వెల్లడించారు. వేడుకల నిర్వహణ కోసం రూ.5 కోట్లు

జాలర్లను కాపాడేందుకు వెళ్లి..

గల్లంతైన 11 మంది ఎస్‌డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బంది



సత్యవల్లి, నవంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ : జాలర్లను కాపాడేందుకు వెళ్లి 11 మంది ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది గల్లంతయ్యారు. ఈ ఘటన ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భారీ వర్షాలకు బేతుపల్లి పెద్ద చెరువు అలుగు పారుతుండటంతో చేపలు బయటకు వెళ్లకుండా వలలు ఏర్పాటు చేసేందుకు ఐదుగురు జాలర్లు వెళ్లి

యుద్ధం వద్దు.. అమెరికన్లూ

ఇదే చెప్పారు : ఇరాన్



నవంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ : అమెరికాలో మధ్యంతర ఎన్నికల ఫలితాలు అధికార పక్షానికి ప్రతికూలంగా వస్తున్న వేళ ఇరాన్ స్పందించింది. ఈ ఫలితాలతో ఇరాన్ పట్ల అమెరికా తీరు మారుతుందని ఊహించవద్దని సుప్రీం లీడర్ ముజ్తబా ఖమేనీ పేర్కొన్నారు. ఇరాన్ పౌరులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇరాన్‌పై అమెరికా మరోసారి భీకర దాడులు చేయవచ్చనే ఊహాగానాల నేపథ్యంలో సుప్రీం లీడర్ నుంచి ఈ స్పందన వచ్చింది. ఇరానీయులు కూడా అమెరికా పట్ల తమ వైఖరిని మునుపెన్నడూ లేనంత స్పష్టంగా అర్థం చేసుకున్నారని ముజ్తబా పేర్కొన్నారు. అయినప్పటికీ, అమెరికా దాడులకు పాల్పడితే ఇరాన్ ప్రతిస్పందన అత్యంత తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. పశ్చిమాసియాలో అమెరికా స్థావరాలను ధ్వంసం చేయడం, హర్మూజ్ జలసంధిలో పట్టుసాధించడం మిగతా .. 2లో..

విద్యార్థుల సంక్షేమం కోసమే

రాజకీయాల్లోకి వచ్చా..


తమిళనాడు సీఎం సి.విజయ్ జోసఫ్



తమిళనాడు, నవంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ : విద్యార్థుల సంక్షేమం కోసమే రాజకీయాల్లోకి వచ్చినట్లు తమిళనాడు ముఖ్యమంత్రి సి.విజయ్ జోసఫ్ తెలిపారు. అవినీతి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. పది, ఇంటర్ బోర్డ్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన మిగతా .. 2లో..

ఈడీ విచారణకు హాజరైన అంబటి

గతంలో అనారోగ్య కారణాలతో విచారణకు హాజరుకాని అంబటి
మద్యం రవాణా టెండర్లలో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపణలు



గుంటూరు, నవంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ : వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. మద్యం రవాణా కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై ఆయన వాంగ్మూలాన్ని అధికారులు నమోదు చేస్తున్నారు. ఈ కేసులో విచారణకు రావాలని మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా

జాతీయ పరీక్షా విధానం ఉండాలి

ఎగ్జామినేషన్ రిఫార్మ్స్ పై పవర్ టాస్క్ ఫోర్స్ చైర్మన్ నందన్ నీలేకని నేతృత్వంలోని బృందం ముఖ్యమంత్రితో సమావేశమైంది. ఈ సందర్భంగా సచివాలయానికి విచ్చేసిన నీలేకనికి రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ సాదరంగా స్వాగతం పలికారు. ఈ భేటీలో టాస్క్ ఫోర్స్‌కు పలు కీలక సూచనలు చేసిన చంద్రబాబు, నేటి తరం విద్యార్థులు, యువత ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా పరీక్షల విధానంలో మార్పులు రావాలని అన్నారు. విద్య కేవలం పరీక్షలు, మార్కులకే పరిమితం కాకూడదని, విద్యార్థులలో నైపుణ్యాలు, సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచనా సామర్థ్యాన్ని పెంపొందించేలా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దాలని అభిప్రాయపడ్డారు.

విద్యార్థులపై ఒత్తిడి తగ్గాలి: మంత్రి లోకేశ్

ఈ సమావేశంలో పాల్గొన్న విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, దేశవ్యాప్తంగా పరీక్షల విధానంలో తీసుకురావాల్సిన మార్పులపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడిని తగ్గించేలా పరీక్షల విధానాన్ని సరళీకరించాలని సూచించారు. ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి విద్య, ఉద్యోగాల కోసం వెళ్లేటప్పుడు భాష, విద్యా విధానం, ధ్రువీకరణ పత్రాల పరంగా ఎదురయ్యే ఇబ్బందులను తొలగించేందుకు జాతీయ స్థాయిలో సమన్వయం అవసరమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో టెక్నాలజీ వినియోగం గురించి వివరిస్తూ, రాష్ట్రంలో 'డేటా లేక్' ద్వారా వివిధ రంగాల సమాచారాన్ని ఒకేచోట సమీకరించి, మెరుగైన పాలనా నిర్ణయాలు తీసుకుంటున్నామని తెలిపారు.

పరీక్షల విధానంలో సమూల మార్పులే లక్ష్యం: నందన్ నీలేకని

అనంతరం టాస్క్ ఫోర్స్ చైర్మన్ నందన్ నీలేకని మాట్లాడుతూ, పరీక్షల నిర్వహణలో పేపర్ లీకేజీలను పూర్తిగా అరికట్టడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించడంపై తాము ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలిపారు. ముఖ్యంగా సైబర్ సెక్యూరిటీ వ్యవస్థలను పటిష్టం చేయడం, డిజిటల్ ఫోరెన్సిక్స్ విభాగాలను బలోపేతం చేయడం వంటి అంశాలపై ప్రత్యేకంగా పనిచేస్తున్నామని వివరించారు. ఈ సంస్కరణల రూపకల్పనలో భాగంగా తాము వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తున్నామని, ఆయా రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, సంస్కరణలపై అభిప్రాయాలను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో సాంకేతికతను వినియోగించి అమలు చేస్తున్న విధానాలపై ఆయన ప్రత్యేక ఆసక్తిని వ్యక్తం చేశారు.

ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డికి

ఈడీ కస్టడీ

అతడిని కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు. ప్రస్తుతం విజయవాడ జైలులో ఉన్న ఈశ్వర్ రెడ్డిని ఈడీ అధికారులు పీటీ వారెంట్‌పై నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. అతడిని తమ కస్టడీకి ఇవ్వాలని కోరగా, న్యాయస్థానం రెండు రోజులకు అనుమతించింది. అంతకుముందు ఈశ్వర్‌కు ఈ నెల 16వ తేదీ వరకు కోర్టు రిమాండ్ విధించిన విషయం తెలిసిందే. ఏపీ లిక్కర్ స్కామ్‌లో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజ్ కెసిరెడ్డికి ఈశ్వర్ అత్యంత సన్నిహితుడని ఈడీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఈ కుంభకోణంలో ఈశ్వర్ పాత్ర, జరిగిన ఆర్థిక లావాదేవీలు, తెరవెనుక ఉన్న ఇతర కీలక వ్యక్తుల ప్రమేయంపై ఈడీ అధికారులు లోతుగా ఆరా తీయనున్నారు. ఈ రెండు రోజుల విచారణలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి.

ఈనెల 23న మేయర్లు, చైర్‌పర్సన్ల ప్రమాణ స్వీకారం : ఎస్ఈసీ

సంఘం ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు. గతంలో మేయర్లు, చైర్‌పర్సన్‌ల ఎన్నిక పరోక్ష విధానంలో ఉండేది. తాజాగా ఈ రెండు పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు జరిగాయి. దీంతో గతంలో ఉన్న ఆదేశాలను సవరించి ఎస్ఈసీ తాజాగా ఉత్తర్వులు జారీ చేయనుంది.

విజయవాడ మేయర్‌గా

వంగవీటి రాధా ఘనవిజయం

భారీ అధిక్యంతో గెలుపొందారు. ఈ సందర్భంగా వంగవీటి రాధా మాట్లాడుతూ... తనకు మేయర్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయం తన ఒక్కడి విజయం కాదని, విజయవాడ ప్రజలందరి విజయమని చెప్పారు. విజయవాడ ప్రజలు చూపిన అభిమానానికి ధన్యవాదాలు తెలిపారు. తన విజయం కోసం ఎంపీ కేశినేని చిన్నితో పాటు స్థానిక కూటమి ఎమ్మెల్యేలు, నేతలు, కార్యకర్తలు కృషి చేశారని తెలిపారు. అందరినీ కలుపుకుని నగర అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు.

తిరుమలలో గణనీయంగా తగ్గిన భక్తుల సందడి

నిరీక్షించాల్సిన అవసరం లేకుండానే నేరుగా దర్శనానికి వెళ్తున్నారు. ప్రస్తుతం సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి సుమారు 6 గంటల సమయం పడుతోంది. అలాగే, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 1 నుంచి 3 గంటల వ్యవధిలోనే దర్శనం పూర్తవుతోంది. నిన్న స్వామివారిని మొత్తం 72,806 మంది భక్తులు దర్శించుకున్నారు. వీరిలో 18,564 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.89 కోట్లుగా నమోదైంది. అదేవిధంగా, టీటీడీ నిన్న ఒక్కరోజే 3.63 లక్షల లడ్డూలను విక్రయించగా, సుమారు 1.55 లక్షల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

'మురసు' తుపాను ప్రభావిత ప్రాంతాల్లో

సీఎం ఏరియల్ సర్వే

శ్రీ సత్యసాయి జిల్లాల్లో పర్యటించిన ఈ బృందం, తమ పరిశీలన వివరాలను ముఖ్యమంత్రికి తెలియజేసింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో విచిత్ర పరిస్థితి నెలకొందని, కోస్తాంధ్ర తుపానులతో సతమతమవుతుంటే, రాయలసీమ, ఇతర ప్రాంతాలు ఎల్ నినో ప్రభావంతో తీవ్ర కరవుతో అల్లాడుతున్నాయని వివరించారు. ఈ ఏడాది వర్షపాతం గణనీయంగా తగ్గిపోవడంతో ఖరీఫ్ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ముఖ్యంగా దేశంలోనే రెండో అత్యల్プ వర్షపాతం నమోదైన అనంతపురం జిల్లా పరిస్థితి అందోళనకరంగా ఉందని కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. సాగునీరు, తాగునీరు, పశుగ్రాసం కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికే 21 జిల్లాల్లోని 388 మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించి, నష్టాల అంచనాతో కేంద్రానికి నివేదిక సమర్పించామని, వారం రోజుల్లోగా సమగ్ర నివేదికను పంపుతామని చెప్పారు. ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు ప్రకృతి వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సీఎం నొక్కిచెప్పారు. ఇందుకోసం ఉపాధి హామీ పథకం కింద పనిదినాలను 200 రోజులకు పెంచాలని, ఈ పథకాన్ని వ్యవసాయ పనులకు కూడా వినియోగించేలా అనుమతించాలని కోరారు. ఈ చర్య వల్ల వ్యవసాయ కూలీల కొరత తీరడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో అదనపు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

ఏపీలో ఎంపీటీసీ, జడ్పీటీసీ

ఎన్నికలకు సర్వం సిద్ధం

కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ, పోలింగ్ విధుల్లో 2.52 లక్షల మంది, కౌంటింగ్‌లో 52 వేల మంది సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. పల్నాడు గోదావరి, గుంటూరు, బాపట్ల జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పరిస్థితులను బట్టి పోలింగ్ కేంద్రాల్లో వీడియోగ్రఫీకి అనుమతిస్తామని, ప్రిసైడింగ్ అధికారులు తప్పనిసరిగా యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 2.61 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. ఎన్నికల బందోబస్తుపై డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఒకే దశలో పోలింగ్ జరుగుతున్నందున రద్దిని నియంత్రించేందుకు తనిఖీల బలగాలను మోహరించామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 582 జెడ్పీటీసీ స్థానాలు, 7,767 ఎంపీటీసీ స్థానాలకు గాను ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పటికే 77 జెడ్పీటీసీ స్థానాలు, 2,051 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవం కావడంతో, మిగిలిన స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల బరిలో 2,169 మంది జెడ్పీటీసీ అభ్యర్థులు, 18,843 మంది ఎంపీటీసీ అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 2.61 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 1.28 కోట్ల మంది పురుషులు, 1.32 కోట్ల మంది మహిళలు, 1,282 మంది ఇతరులు ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండటం గమనార్హం. ఓటర్ల సౌలభ్యం కోసం రాష్ట్రవ్యాప్తంగా 31,460 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. మొత్తం పోలింగ్ కేంద్రాల్లో 8,904 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా, 7,160 కేంద్రాలను అత్యంత సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. ఈ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. 16,064 కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు, సుమారు 6,000 కేంద్రాల్లో ల్యాప్‌టాప్‌ల ద్వారా వెబ్‌కాస్టింగ్, 6,507 కేంద్రాల్లో వీడియోగ్రఫీ ద్వారా పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించనున్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా 36,684 మంది ప్రిసైడింగ్ అధికారులను నియమించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం సుమారు 40,679 మంది పోలీసు సిబ్బందిని మోహరించారు. సిబ్బందిని, ఎన్నికల సామగ్రిని తరలించేందుకు 4,442 భారీ వాహనాలు, 3,200 తేలికపాటి వాహనాలను వినియోగిస్తున్నారు. పోలింగ్ కోసం 1,01,618 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. ఓట్ల లెక్కింపు కోసం 365 కేంద్రాలను ఏర్పాటు చేయగా, వాటిలో 9,062 కౌంటింగ్ టేబుళ్లను సిద్ధం చేశారు. గ్రామీణ ప్రాంతాలపై పల్లు నిరూపించుకునేందుకు ఈ ఎన్నికలు రాజకీయ పార్టీలకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మారాయి.

వరుస తుపాన్ల నేపథ్యంలో

సీఎం చంద్రబాబుకు ఫోన్ చేసిన ప్రధాని మోదీ

చంద్రబాబు ప్రధానికి వివరించారు. భారీ వర్షాలు, బలమైన గాలుల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల రంగాల్లోనూ భారీ నష్టం వాటిల్లిందని, రాష్ట్రాన్ని ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం తగిన సహాయం అందించాలని కోరారు. దీనిపై స్పందించిన ప్రధాని మోదీ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలను ప్రశంసించారు. నిరంతర అప్రమత్తతతో తుపాను సవాళ్లను సమర్థంగా ఎదుర్కొన్నారని చంద్రబాబును అభినందించారు. అంతకుముందు ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాయడంతో పాటు ఫోన్‌లోనూ మాట్లాడారు. మంగళవారం ఒక్కరోజే రెండుసార్లు అమిత్ షాతో మాట్లాడిన చంద్రబాబు, ఒక తుపాను నుంచి కోలుకోకముందే మరో తుపాను రావడం వల్ల పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారిందని వివరించారు. 'మురసు' తుపాను వల్ల రాష్ట్రంలో ప్రాథమికంగా రూ.343.95 కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా వేశామని తెలిపారు. ఇందులో సుమారు 94 శాతం నష్టం ఒక్క వ్యవసాయ రంగంలోనే జరిగిందని పేర్కొన్నారు. ఏడు జిల్లాల్లోని 465 గ్రామాల్లో 50,473 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని, దీనివల్ల 69,828 మంది రైతులు నష్టపోయారని సీఎం వివరించారు. దెబ్బతిన్న పంటల్లో 45,900 హెక్టార్ల వరి పంట ఉందని, ఒక్క వ్యవసాయ రంగంలోనే ప్రాథమిక నష్టం రూ.324.22 కోట్లుగా ఉందని తెలిపారు. ముఖ్యంగా బాపట్ల, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఉద్యాన పంటలతో సహా పంట నష్టం తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. తుపాన్ల హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ), రియల్-టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టీజీఎస్)లను అప్రమత్తం చేశామని చంద్రబాబు తెలిపారు. సహాయక చర్యల కోసం 11 ఎన్‌డీఆర్ఎఫ్, 13 ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామని, ప్రభావిత జిల్లాల్లో 480 పాఠశాలను పునరావాస కేంద్రాలుగా మార్చి, 12,230 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని కేంద్రానికి వివరించారు.

పోలవరం-బనకచర్ల లింక్‌పై

రేవంత్ సర్కార్ ద్వంద్వ వైఖరి

సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పోలవరం – బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సమ్మతి తెలపడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని కవిత ఆరోపించారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ నీటి హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతుందని, 2024లోనే తెలంగాణ జాగృతి తరపున తాము దీనిని వ్యతిరేకించామని గుర్తుచేశారు. "రాష్ట్రానికి హక్కుగా దక్కాల్సిన 250 టీఎంసీల గోదావరి జలాలను సీఎం రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుకు 'గురుదక్షిణ'గా చెల్లించుకుంటున్నారు" అని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆమోదంతోనే ఏపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు విషయంలో ముందుకెళ్లేందుకు కేంద్రంపై ఒత్తిడి తెస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు జరిగే నష్టాన్ని గుర్తించాలని కవిత హెచ్చరించారు. ఈ ప్రాజెక్టుపై కేంద్రం జరిపే అన్ని సంప్రదింపుల నుంచి తెలంగాణ తక్షణమే వైదొలగాలని, ప్రాజెక్టును అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం వెంటనే లేఖ రాయాలని ఆమె డిమాండ్ చేశారు.

సదరన్‌ను అధికారికంగా రాష్ట్ర పండుగగా ప్రకటించిన

తెలంగాణా ప్రభుత్వం

మంజూరు చేసినట్లు తెలిపారు. గతంలో ఏ ముఖ్యమంత్రీ సదరన్‌ను రాష్ట్ర పండుగగా ప్రకటించే ఆలోచన చేయలేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లోని నేటి గోల్కొండ కోట ఒకనాటి 'గొల్లకొండ' అని, నగర అభివృద్ధిలో యాదవుల పాత్ర కీలకమని కొనియాడారు. తమ ప్రభుత్వంలో యాదవులకు సముచిత స్థానం కల్పించామని, అనిల్ కుమార్ యాదవ్‌కు రాజ్యసభ, నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యే పదవి ఇవ్వామని గుర్తుచేశారు. యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు సభ్యురాలిగా శత్రయమ్మ యాదవ్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. తెలంగాణలో విజయపథంగా నిర్వహించిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందని, రాబోయే రోజుల్లో యాదవులకు న్యాయమైన వాటా దక్కేలా చూస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. యాదగిరిగుట్టలో గోసంరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. మూసీ పునరుజ్జీవం, మెట్రో విస్తరణ వంటి అభివృద్ధి ప్రాజెక్టులకు యాదవ సోదరులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

జాలర్లను కాపాడేందుకు వెళ్ల..

గల్లంతైన 11 మంది ఎన్‌డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బంది

వరదలో చిక్కుకున్నారు. వారిని కాపాడేందుకు తొలుత ముగ్గురు ఫైర్ సిబ్బంది బోటులో వెళ్లగా అది మొరాయించడంతో చిక్కుకుపోయారు. దీంతో కొత్తగూడెం ఎన్‌డీఆర్ఎఫ్‌కు చెందిన ఆరుగురు, మరో నలుగురు ఫైర్ సిబ్బంది, ఇద్దరు గైడ్‌లు రెండు బోట్లలో వారిని కాపాడేందుకు వెళ్లారు. తొలుత బోటులో చిక్కుకుపోయిన ముగ్గురు అగ్నిమాపక సిబ్బందిని వెనక్కి తీసుకొచ్చారు. అనంతరం మత్స్యకారులను తీసుకొచ్చేందుకు వెళ్లగా రెండు బోట్లు పల్టీలు కొట్టి అందులోని 11 మంది గల్లంతయ్యారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ దివాకర్ టీఎస్, ఎమ్మెల్యే మట్టా రాగమయి అక్కడికివెళ్లి సిబ్బందితో కలిసి సహాయ చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో భద్రాచలం నుంచి ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందిని రప్పించి బోటు సహాయంతో చిక్కుకున్న వారిని కాపాడే ప్రయత్నం చేపట్టారు. డ్రోన్‌తో లైఫ్ జాకెట్లు పంపించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బేతుపల్లి చెరువులో ఎస్‌డీఆర్ఎఫ్ బోట్ల గల్లంతైన ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. ఎన్‌డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బందిని సురక్షితంగా తీసుకువచ్చేందుకు అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాల్సిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు సీఎం సూచించారు. మరోవైపు చిక్కుకుపోయిన జాలర్లు సురక్షితంగా ఉన్నట్లు సమాచారం.

విద్యార్థుల సంక్షేమం కోసమే

రాజకీయాల్లోకి వచ్చా..

విద్యార్థులను అభినందించేందుకు ఏర్పాటు చేసిన విద్యా పురస్కారాల మొదటి విడత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత తమ వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని, జీవితంలో ఎదురయ్యే అడ్డంకులకు భయపడకూడదని పిలుపునిచ్చారు."మీరు వెళ్తున్న మార్గంలో ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే, అప్పటికే మీ విజయం ఖాయమయ్యిందని అర్థం చేసుకోవాలి. మీ సంక్షేమం కోసమే నేను రాజకీయాల్లోకి వచ్చా. అది మీకూ తెలుసు" అని సీఎం విజయ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు, నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.

ఈడీ విచారణకు హాజరైన అంబటి

గతంలోనే ఈడీ అంబటికి నోటీసులు ఇచ్చింది. అయితే, తనకు ఇటీవల గుండెకు స్టెంట్లు వేశారని, అనారోగ్య కారణాలతో హాజరుకాలేనని ఆయన వైద్య నివేదికతో పాటు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో, నవంబర్ 4న తప్పనిసరిగా విచారణకు రావాలని ఈడీ మరోసారి నోటీసులు జారీ చేయడంతో ఆయన హైదరాబాద్‌లోని కార్యాలయానికి వచ్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం రవాణా టెండర్లలో భారీగా అవకతవకలు జరిగాయని, దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.195 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని ఏపీ సీబీడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ ఈ కేసులో దర్యాప్తు చేస్తోంది. కొందరికి అనుకూలంగా టెండర్ నిబంధనలు మార్చారని ప్రధాన ఆరోపణగా ఉంది. ఈ కేసులో ఇప్పటికే గత వైసీపీ ప్రభుత్వ మాజీ ఐటీ సలహాదారు కెసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఏపీఎస్ఐటీసీఎల్ మాజీ ఎండీ దొంతిరెడ్డి వాసుదేవ రెడ్డి, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఆయన కుమారుడు సునీల్ కుమార్‌లను ఈడీ అరెస్ట్ చేసింది. గతంలో నోటీసులు అందుకున్నప్పుడు "తాను ఏ తప్పూ చేయలేదని, విచారణకు పూర్తిగా సహకరిస్తానని" అంబటి రాంబాబు పేర్కొన్న విషయం తెలిసిందే.

యుద్ధం వద్దు.. అమెరికన్లూ ఇదే చెప్పారు : ఇరాన్

వంటివి అమెరికా అధిపత్యానికి అడ్డుకట్ట వేసే చర్యలేనన్నారు.

ఫలితాలను స్వాగతిస్తున్నాం..

అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చిన ఫలితాలను ఇరాన్ నేతలు స్వాగతించారు. యుద్ధం వద్దు అనే విషయాన్ని అమెరికన్లు చెబుతున్నట్లు అర్థమవుతోందని, ఇదే సందేశాన్ని తాము కూడా సమర్థిస్తున్నామని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ పేర్కొన్నారు.

క్రిప్టో స్కామ్ గుట్టురట్టు చేసిన ఏపీ సీబీడీ..

తెనాలి మహిళకు రూ.15 కోట్లు వెనక్కి!

అధిక లాభాల ఆశచూపి తెనాలి మహిళ నుంచి దబ్బు కాజేసిన అంతర్జాతీయ ముఠా

బ్లాక్‌చెయిన్ విశ్లేషణతో నిందితుల ఖాతాలను గుర్తించి, ఆస్తులను స్తంభింపజేసిన అధికారులు

బాధితురాలికి దబ్బు తిరిగి ఇవ్వాలని గుంటూరు కోర్టు కీలక ఆదేశాలు

హైదరాబాద్, చైనా, మలేషియాకు చెందిన 8 మంది అరెస్ట్, ఛార్జ్‌షీట్ దాఖలు



నవంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ నేర పరిశోధన విభాగం (సీబీడీ) సంచలన విజయం సాధించింది. సుమారు రూ.15 కోట్ల విలువైన భారీ అంతర్జాతీయ క్రిప్టో కరెన్సీ మోసాన్ని ఛేదించి, నిందితుల నుంచి సొమ్మును బాధితురాలికి తిరిగి ఇప్పించడంలో సఫలమైంది. సంక్లిష్టమైన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఈ కేసు దర్యాప్తులో ఏపీ సీబీడీ చూపిన ప్రతిభపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. సీబీడీ విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం, తెనాలికి చెందిన ఓ మహిళను అంతర్జాతీయ సైబర్ నేరగాళ్ల ముఠా లక్ష్యంగా చేసుకుంది. క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మబలికి, ఆమె నుంచి విడతలవారీగా రూ.15 కోట్లు కాజేశారు. మోసపోయానని గ్రహించిన బాధితురాలు మంగళగిరిలోని సీబీడీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. బాధితురాలు తొలుత తన బ్యాంకు ఖాతాల నుంచి 13 వేర్వేరు క్రిప్టో వాలెట్లకు నిధులు బదిలీ చేశారు. ఆ తర్వాత నిందితుల సూచనలతో 'హనీకోంట్‌పీఐ.ఆర్స్', 'అలీబార్బిట్.బిట్' వంటి నకిలీ ప్లేట్‌ఫామ్‌లలో పెట్టుబడి పెట్టారు. బిట్‌కాయిన్, సోలానా, డాగీకాయిన్ రూపంలో సుమారు 1.5 మిలియన్ డాలర్ల విలువైన 27 లావాదేవీలు జరిపారు. ఈ నిధులను నిందితుల ముఠా అనేక మ్యూల్ ఖాతాల ద్వారా, పలు దశల్లో బదిలీ చేస్తూ (స్ట్రక్చర్డ్ లేయరింగ్) కేమన్ ఐలాండ్స్ కేంద్రంగా పనిచేసే 'గేట్ గ్లోబల్ కార్పొరేషన్' అనే క్రిప్టో ఎక్స్ఛేంజ్‌కు తరలించినట్లు సీబీడీ గుర్తించింది. బ్లాక్‌చెయిన్ లావాదేవీలను క్షుణ్ణంగా విశ్లేషించి, కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ సాంకేతిక సహకారంతో నిందితులకు చెందిన నాలుగు ఖాతాలను గుర్తించారు. వెంటనే న్యాయపరమైన చర్యలతో ఆ ఖాతాలను స్తంభింపజేశారు. ఈ అంతర్జాతీయ ముఠాతో సంబంధం ఉన్న 8 మందిని సీబీడీ అరెస్ట్ చేసింది. వీరిలో ఇద్దరు హైదరాబాద్ వాసులు కాగా, ఇద్దరు మహారాష్ట్ర, ఒకరు మలేషియా, ఇద్దరు చైనా, ఒకరు పోర్చుగల్‌కు చెందిన వారు ఉన్నారు. ఈ ముఠాపై గుంటూరు కోర్టులో ఛార్జ్‌షీట్ కూడా దాఖలు చేశారు. కేసు విచారణ అనంతరం గుంటూరు కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. నిందితుల ఖాతాల్లో స్తంభింపజేసిన క్రిప్టో ఆస్తులను అప్పటి మార్కెట్ విలువకు అనుగుణంగా యూఎస్‌డీటీలోకి మార్చి, ఆ మొత్తాన్ని బాధితురాలి వాలెట్‌కు బదిలీ చేయాలని 'గేట్ గ్లోబల్ కార్పొరేషన్'ను ఆదేశించింది. అంతర్జాతీయ స్థాయిలో జరిగిన ఇలాంటి సంక్లిష్టమైన సైబర్ మోసంలో, పోయిన దబ్బును వెనక్కి రప్పించడం ఒక అసాధారణ విజయమని సీబీడీ అధికారులు పేర్కొన్నారు.

ఎడిటర్ వాయిస్

కోస్తా గేట్ తాకని వైసీపీ.. సేమ్ సీన్ రిపీట్

ఏపీలో జరిగిన అర్బన్ బాడీ ఎన్నికల్లో చూస్తే ఒక కీలక పరిణామం గురించిన చర్చ సాగుతోంది. మొత్తం 100 దాకా కార్పొరేషన్, మునిసిపాలిటీలు, నగర పంచాయతీలకు జరిగిన ఎన్నికల్లో వైసీపీకి దక్కినవి నాలుగు మాత్రమే. అందులో అనంతపురం కార్పొరేషన్ తో పాటు నంద్యాల మునిసిపాలిటీ, బేతంచర్ల, నాయుడుపేటలలో వైసీపీ జెండా ఎగరేసింది. ఇందులో రెండు మున్సిపాలిటీలు నంద్యాల జిల్లాలో ఉంటే ఒకటి తిరుపతిలో ఉంది. అలా వైసీపీ విజయం రాయలసీమకు పరిమితం అయింది. అక్కడ నుంచి నెల్లూరు, ప్రకాశం మీదుగా కోస్తా తీరం వైపు వైసీపీ అసలు రాలేకపోయింది అని గుర్తు చేస్తున్నారు.

కోస్తాలోనే షాక్ : నిజం చెప్పాలి అంటే వైసీపీకి 2024 ఎన్నికల్లో కూడా మొత్తం కోస్తా జిల్లాలలో అల్లూరి జిల్లాలో రెండు ఎమ్మెల్యే ఒక ఎంపీ సీటు తప్ప మొత్తం అంతా ఊడ్చేసినట్లు అయింది. ఉత్తరాంధ్ర నుంచి ఉభయ గోదావరి జిల్లాలతో పాటు క్రిష్ణా గుంటూరులో వైసీపీ ఎక్కడా కనిపించలేదు. ఇపుడు కూడా అదే విధంగా సీన్ కనిపిస్తోంది అని అంటున్నారు. వైసీపీకి ఉత్తరాంధ్రాలో కనీసం విజయనగరం మేయర్ సీటు అయినా దక్కుతుందని తొలుత ప్రచారం సాగింది. కానీ అక్కడ వైసీపీ పట్టు జారింది, చిన్న శ్రీను పార్టీని వీడిపోవడం మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కూడా టీడీపీలో చేరడంతో తారు మారు అయింది అని అంటున్నారు. లేకపోతే విజయనగరం కార్పొరేషన్ వైసీపీ పరం అయ్యేదని చెబుతున్నారు.

ఇంచార్జిలు పనితీరు : జగన్ పదే పదే చెబుతున్నా ఇంచార్జిల పనితీరు అలాగే ఉంది అని అంటున్నారు. ఏకగ్రీవాలు లేకుండా చూసుకోండి అన్న జగన్ మాటనే వారు వేరేగా వాడారని అంటున్నారు. ఏదో తంటాలు పడి అభ్యర్థి చేత నామినేషన్ వేయించేస్తే చాలు అని ఆలోచించారు అంటున్నారు. దాంతో బలమైన అభ్యర్థులను ఎక్కడా పోటీకి పెట్టలేదని గుర్తు చేస్తున్నారు. అండగా అభ్యర్థులకు ఉండాలని అధినేత అంటే దానిని కూడా వదిలేశారు అని అంటున్నారు. దాంతో గెలుపు అవకాశాలు ఉన్న చోట్ల కూడా వైసీపీకి నాయకుల నుంచి సహకారం లభించలేకపోవడం వల్ల వారు ఓటమి పాలు అయ్యారని అంటున్నారు. అలా జీవీఎంసీ పరిధిలో అనకాపల్లి జోన్ లో రెండు డివిజన్లు గెలుపు చాన్స్ ఉన్నా వైసీపీ పోగొట్టుకుందని అంటున్నారు. అదే విధంగా భీమిలీ నియోజకవర్గం ఇంచార్జి గా బొత్స అనూష విజయనగరం జెడ్పీటీసీగా పోటీ చేయడంతో అక్కడ వైసీపీ పూర్తిగా ఎవరికీ పట్టనట్లు అయింది. దాంతో మొత్తం సీట్లు టీడీపీ ఖాతాలో పడ్డాయని అంటున్నారు.

గోదావరిలో స్ట్రాంగ్ గా : ఇక గోదావరి జిల్లాలు అసలే జనసేన టీడీపీకి పట్టు ఉన్నాయి. ఆ రెండు పార్టీలు కలసి గట్టిగానే పనిచేశాయి. దాంతో వైసీపీ ముందే చేతులు ఎత్తేసింది అన్న టాక్ వినిపిస్తోంది. బలంగా పోరాడితే ఎంతో కొంత ప్రయోజనం ఉంది అనుకున్న చోట కూడా ఎందుకులే అని చాలా మంది ఇంచార్జిల వ్యవహారంతో వైసీపీకి దక్కాల్సినవి కూడా కాకుండా పోయాయని అంటున్నారు. మొత్తం మీద చూస్తే వైసీపీ ఇంకా నిద్రావస్థలో ఉంది అని స్థానిక ఎన్నికల ఫలితాలు రుజువు చేశాయని అంటున్నారు.



పార్టీ మొత్తంగా రిపేర్లు చేసుకోకపోతే మాత్రం సార్వత్రిక ఎన్నికల్లో కూడా ఇబ్బందులు ఎదురవుతాయని పార్టీ హితైషులు హెచ్చరిస్తున్నారు.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

క్రైమ్ వాయిస్

రైలు కింద పడి..

ఇద్దరు కుమార్తెలతో కలిసి తల్లి ఆత్మహత్య



యాడికి, విశ్వం వాయిస్ న్యూస్ : అనంతపురం జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. రైలు కింద పడి తల్లికుమార్తెలు ఆత్మహత్య చేసుకున్నారు. యాడికి మండలం రాయలచెరువు-వేములపాడు గ్రామాల రైల్వేస్టేషన్ మధ్య ఈ ఘటన జరిగింది. తల్లి, ఓ కుమార్తె అక్కడిక్కడే మృతి చెందగా మరో చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన చిన్నారిని రాయలచెరువు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలిస్తుండగా ఆ చిన్నారి కూడా మృతి చెందింది. ఈ ఘటనకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

అధిక లాభాల పేరుతో నెల్లూరులో రూ.2.13 కోట్ల మోసం

వైకాపా నాయకులతో సహా 8 మందిపై కేసు

నెల్లూరు, విశ్వం వాయిస్ న్యూస్ : అధిక లాభాల ఆశ చూపి రూ.2.13 కోట్లు వసూలు చేసి మోసం చేసిన ఘటన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో వెలుగు చూసింది. కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన బాధితురాలు పినపాల చిన్న రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. కిరాణా కిట్, మనీ స్కీమ్‌లలో పెట్టుబడులు పెడితే అధిక మొత్తంలో లాభాలు ఇస్తామని చెబుతూ.. నెల్లూరు జిల్లా టీపీగూడూరు మండలం చింతోపు గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు ఎండ్లూరు సుధాకర్ 2023లో నెల్లూరులో సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో టీపీగూడూరు మండల వైకాపా అధ్యక్షుడు ఉప్పల శంకరయ్య గౌడ్‌తో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లా కల్యాణదుర్గంకు చెందిన దాసరి అనితలు.. విజయవాడకు చెందిన గుత్త వేణుగోపాల కృష్ణ, కిరణ్, గుంజాల లక్ష్మి, గోపాల కృష్ణ, రోహిణిలను 'అరుణోదయ నెట్‌వర్క్ మార్కెటింగ్ లిమిటెడ్' కంపెనీ డైరెక్టర్‌లుగా పరిచయం చేశారు. కిరాణాకిట్ పథకంలో రూ.7 వేలు చెల్లిస్తే అంతే మొత్తానికి సరకులు అందజేయడంతో పాటు 100 రోజుల్లో సభ్యుల ఖాతాలో నగదు జమ అవుతుందని, మనీ స్కీంలో రూ.లక్ష పెట్టుబడి పెడితే 300 రోజులకు కలిపి రూ.3 లక్షలు జమ చేస్తామని నమ్మబలికారు. ఈ క్రమంలోనే చిన్నరామలక్ష్మి, సామర్లకోటకు చెందిన ఆచంట సత్యతో కలిపి రూ.20 లక్షలను నిర్వాహకులు వారి బ్యాంకు ఖాతాల్లో జమచేయించుకున్నారు. ఇలా నెల్లూరు జిల్లాతో పాటు, చెన్నై, అనంతపురం, విజయవాడ ప్రాంతాలకు చెందిన దాదాపు 40 మంది నుంచి విడతల వారీగా 2024 జనవరి నుంచి మొత్తం రూ.2.13 కోట్లు జమ చేయించుకున్నారు. ప్రారంభంలో సభ్యుల ఖాతాల్లో రోజుల వారీగా నగదు జమ అవుతున్నట్లు వెబ్‌సైట్లో చూపించారు. 2024 మార్చి 15న వెబ్‌సైట్ నిలిచిపోయింది. దీంతో చిన్నరామలక్ష్మి నెల్లూరు వచ్చి నిర్వాహకులను కలిసి పెట్టుబడిగా చెల్లించిన నగదు ఇవ్వాలని అడగ్గా.. సుధాకర్, శంకరయ్యగౌడ్‌లు బెదిరించారు. దాంతో బాధిత మహిళ గత నెల 31న టీపీగూడూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో సుధాకర్, శంకరయ్య గౌడ్‌లతో పాటు మిగిలిన ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అంతర్జాతీయ ఫేక్ కాల్‌సెంటర్ గుట్టురట్టు



హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : హైదరాబాద్‌లోని ఓ అంతర్జాతీయ నకిలీ కాల్‌సెంటర్ గుట్టును ఈడీ అధికారులు బయటపెట్టారు. ఈ కాల్ సెంటర్ నిర్వహిస్తున్న హర్షల్ రావల్ ముఠా సభ్యులు అమెరికా పౌరులే లక్ష్యంగా మూడేళ్లుగా వ్యవస్థీకృత సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు. హర్షల్ రావల్ తొలుత హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఫేక్ కాల్ సెంటర్ ఏర్పాటుచేశారు. దీనిపై పోలీసులు దాడులు చేయడంతో పంజాబ్‌లోని పాటియాలాకు మకాం మార్చేశారు. అక్కడ మరో ఫేక్ కాల్ సెంటర్ ఏర్పాటుచేసి మోసాలు కొనసాగించారు. ఈ కేసులో హర్షల్ రావల్, ప్రణవ్ పితాదియా, చేతన్ ముంజల్‌ను ఈడీ అధికారులు పాటియాలాలో అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. దీనిపై దర్యాప్తు చేయగా వేలాది మంది అమెరికా పౌరులను మోసం చేసినట్లు గుర్తించారు. ఇలా సంపాదించిన సొమ్మును తరలించేందుకు పదల సంఖ్యలో మ్యూల్ బ్యాంకు ఖాతాలను వినియోగించారు. అమెరికా నుంచి క్రిప్టో కరెన్సీ రూపంలో డబ్బులు స్వీకరించి, హవాలా మార్గాల్లో నగదు బదిలీ చేసుకున్నారు. దాదాపు రూ.400 కోట్ల మేర క్రిప్టో లావాదేవీల ద్వారా మోసాలకు పాల్పడినట్లు ఈడీ అధికారులు అనుమానిస్తున్నారు.

అత్తింటిపై అల్లుడి దాడి..

ఇద్దరు మహిళల హత్య



హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో సిద్ధిఖ్ తన అత్తింటి కుటుంబంపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. మృతులను అత్త నిరంజన్‌బీ, బావమరిది భార్య రేష్మాగా గుర్తించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, గాలిస్తున్నట్లు తెలిపారు. ఇవాళ ఉదయమే బాధిత కుటుంబ సభ్యులు.. సిద్ధిఖ్ నుంచి తమ ప్రాణాలకు ముప్పు ఉందని, రక్షణ కల్పించాలని కోరుతూ మీర్‌పేట్ పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం.



విశ్వం వాయిస్

అవినీతిపై - అక్షర సమరం...

VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు



గురువారం, 05 నవంబర్, 2026

4

www.viswamvoice.com

సత్యం • సమగ్రం • సమాజ బద్ధత

www.viswamvoice.com

గుత్తుల మురళీధర్‌కు

వైసిపి నాయకుల ఘన నివాళులు

గుత్తుల కోటేశ్వరిని ప్రజలు ఆశీర్వదించాలని "మార్గాని భరత్" విజ్ఞప్తి



రాజమహేంద్రవరం, నవంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ : 50వ డివిజన్ మాజీ కార్పొరేటర్, వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర నాయకుడు గుత్తుల మురళీధరరావు ప్రథమ వర్ధంతి కార్యక్రమం స్థానిక సిటిఆర్‌ఐ వద్దనున్న సుబ్రహ్మణ్య నగర్‌లో ఉన్న ఆయన నివాసంలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి రాజమహేంద్రవరం మాజీ ఎంపీ, వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మార్గాని భరత్ రామ్, బీసీ జేఏసీ ఉభయ రాష్ట్రాల చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, వైసిపి నాయకులు హాజరై. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ కార్పొరేటర్‌గా ఆయన అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. అటువంటి నాయకుడికి కోల్పోయి ఏడాది కాలం గడిచిపోవడం చాలా బాధాకరమన్నారు. వైసిపి తరపున డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా, రాష్ట్ర కార్యదర్శిగా కూడా ఆయన పనిచేసి వైసిపి బలోపేతానికి నిరంతరం కృషిచేసారన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఆయన కుటుంబ సభ్యులకు వైసిపి ఎల్లప్పుడూ అండగా నిలబడుతుందని భరోసా ఇచ్చారు. అన్ని వార్డులు ఒక లెక్క గుత్తుల మురళీధర్ వార్డు ఒక లెక్క అని గుత్తుల కోటేశ్వరిని స్థానిక ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. వారి సొంత ఇంటిని ఏ విధంగా చూసుకుంటారో అలాగే వార్డును కూడా చూసుకుంటున్నారని భరోసా ఇచ్చారు. గుత్తుల కోటేశ్వరి, కుమారుడు గుత్తుల హర్షకు వార్డు ప్రజలు అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కోడి ప్రవీణ్, మార్తి లక్ష్మీ, సంకిస భవానీప్రియ, పోలు విజయలక్ష్మి, దాని వెంకట్రావు, మార్తి నాగేశ్వరరావు, ముప్పన ప్రభాకర్, కాటం రజనీకాంత్, మదీనా భాషా, కళ్ళి మురళి, నల్లమిల్లి సత్యనారాయణ రెడ్డి, పీతా రామకృష్ణ, రేగుళ్ల నాని, అనంత లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ ఓ మధురఘట్టం

శ్రీరామ ఉత్సవ సమితి సమావేశంలో కార్యకర్తల ఆనందం



రాజమహేంద్రవరం, నవంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ : ఛత్రపతి శివాజీ విగ్రహం పెట్టాలని ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న కల నెరవేరినందుకు ఎంతో ఆనందంగా ఉందని పలువురు పేర్కొన్నారు. శివాజీ విగ్రహావిష్కరణ అనే మరపురాని మధుర ఘట్టంలో పాల్గొనడం ఎంతో ఆనందాన్ని కల్గించిందని పేర్కొన్నారు. శ్రీరామ ఉత్సవ సమితి అధ్వర్యాన అక్టోబరు 25న కంబాల చెర్వు సెంటర్ లో ఛత్రపతి శివాజీ విగ్రహం ఆవిష్కరించిన నేపథ్యంలో ఇందులో పాల్గొన్న కార్యకర్తలతో సమితి షష్ఠన ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాలులో సమావేశం నిర్వహించారు.శ్రీరామ ఉత్సవ సమితి అధ్యక్షుడు పతివాడ రామరాజు అధ్యక్షత వహిస్తూ, విగ్రహం ఎలా ఏర్పాటుచేయాలి, ఏ సైజులో ఉండాలి, దీనికి నిధి సేకరణ, ఆవిష్కరణ కార్యక్రమ సోము, శివ బండ్ల శంకర్, కర్రి నిర్వహణ గురించి యోజన చేసి శ్రీనివాస్, తాడోజు హరి, ప్రవీణ్ అమలు చేయడంలో సహకరించిన చౌహన్, సత్య, బొమ్ముల రవిచంద్ర, ప్రతి ఒక్కరికీ అభినందనలు సతీష్, నామాల శ్రీనివాస్, తదితరులు తెలియజేసారు. శివాజీ విగ్రహాన్ని తమ ఆనందాన్ని పంచుకుంటూ, చూడగానే ఓ స్ఫూర్తి కలుగుతుం చారిత్రక రాజమహేం ద్రవరంలో దన్నారు. కార్యదర్శి యడ్లపల్లి అయ్యప్ప ఛత్రపతి శివాజీ విగ్రహ ఆవిష్కరణ స్వామి, ఆర్ ఎస్ ఎస్ విభాగ్ ప్రచారక్ గొప్ప ఘట్టమని పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు పక్కాగా ఉండాలి

రూట్ ఆఫీసర్స్ సమావేశంలో కమిషనర్ రాహుల్ మీనా
పోలింగ్ కేంద్రాలకు రూట్ మ్యాప్‌లను సిద్ధం చేసుకోవాలి



రాజమహేంద్రవరం, నవంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ : బ్యాలెట్ బాక్స్‌లను సురక్షితంగా స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచే వరకు బాధ్యతగా విధులు నిర్వహించాలని కమిషనర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. రానున్న మూని సిపల్ ఎన్నికల నేపథ్యంలో నగర పాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్‌ఎస్ హాల్ నందు రూట్ ఆఫీసర్స్, ఎమినిటీ సెక్రటరీలతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక పరిధిలోని 72 వార్డులలో గల 494 పోలింగ్ స్టేషన్లలో 4,63,322 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాలు తాగునీరు, ఫర్నిచర్, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్, లైటింగ్, టాయిలెట్స్ తదితర వసతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా బారికేడింగ్ పటిష్టంగా ఉండాలన్నారు. వివిన్న ప్రతిభావంతులు వంద శాతం ఓటు హక్కును వినియోగించుకొనేలా పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపు, వీల్ చైర్స్‌తో పాటుగా సహాయకులను అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్న విషయం ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. పోలింగ్ కేంద్రాలలోవీడియో కవరేజ్, వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అన్ని పోలింగ్ స్టేషన్లకు బస్సులు సులువుగా వెళ్లేలా రహదారులు సౌకర్యంగా ఉన్నదీ లేనిదీ తనిఖీ చేసుకుని రూట్ మ్యాప్ సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే పోలింగ్ స్టేషన్లలో ప్రిసైడింగ్ ఆఫీసర్ (పి.ఓ.), అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు (ఏ.పి.ఓ) రాత్రి సమయంలో ఉంటారు. వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని సదుపాయాలు పోలింగ్ స్టేషన్లలో ఏర్పాటు చేయించాలన్నారు. ఒకే భవనంలో రెండు లేదా అంతకన్నా ఎక్కువ పోలింగ్ స్టేషన్లు ఉన్నట్లయితే.. ఓటర్లకు గందరగోళానికి గురికాకుండా సహాయార్థం ఒక హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లో కూడా మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ ప్రణాళికాకాబద్ధంగా జరగాలన్నారు. ఎలక్షన్ మెటీరియల్ తీసుకున్న అనంతరం నిర్దేశించిన చెక్ లిస్టు ప్రకారం మెటీరియల్ తనిఖీ చేసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ పూర్తైన అనంతరం మరలా బ్యాలెట్ బాక్స్‌లను, పోలింగ్ స్టాఫ్ ను నిర్దేశిత మ్యాప్ ప్రకారం తీసుకువచ్చి బ్యాలెట్ బాక్స్‌లను స్ట్రాంగ్ రూమ్ లలో భద్రపరచాలన్నారు. అలాగే సంబంధిత రూట్ లో ఉన్న ప్రతి పోలింగ్ స్టాఫ్ అందరు బస్సు ఎక్కిన తరువాత మాత్రమే బస్సులు బయలుదేరాలని ఆదేశించారు.రూట్ అధికారులు వారికి నిర్దేశించిన పోలింగ్ స్టేషన్లలోని ఆర్.ఓ ల సమన్వయంతో ఈ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, డిప్యూటీ సిటీ ప్లానర్ నాయుడు, రెవిన్యూ ఆఫీసర్ సీహెచ్ శ్రీనివాసరావు, మేనేజర్ అబ్దుల్ మలిక్, రూట్ ఆఫీసర్స్, ఎమినిటీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో

4, 5 తేదీల్లో స్థానిక సెలవు

- 4న పోలింగుకు వినియోగించే ప్రభుత్వ, విద్యా సంస్థలకు సెలవు
- 5న పోలింగ్ జరిగే ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలకు సెలవు
- పోలింగ్‌కు 48 గంటల ముందు నుంచి మద్యం దుకాణాల మూసివేత
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కీర్తి చేకూరి



రాజమహేంద్రవరం, నవంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ : తూర్పుగోదావరి జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ఈనెల 5వ తేదీన నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి 4, 5 తేదీల్లో స్థానిక సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.4వ తేదీ (బుధవారం) పోలింగ్‌కు ముందు రోజు కావడంతో ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ కేంద్రాలుగా వినియోగించే ప్రభుత్వ భవనాలు, విద్యా సంస్థల భవనాలు, ఇతర భవనాలకు సెలవు ప్రకటించారు.5వ తేదీ (గురువారం) పోలింగ్ రోజున పోలింగ్ జరిగే ప్రాంతాల్లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు,ప్రభుత్వ సంస్థలకు సెలవు ప్రకటించారు.అదేవిధంగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఆయా ప్రాంతాల్లోని ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు, వాణిజ్య సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు కూడా సెలవు వర్తిస్తుంది.ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ జరిగే ప్రాంతాల్లో పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల ముందు నుంచే మద్యం దుకాణాలను మూసివేయాలని, డ్రై డే నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.ఈ ఉత్తర్వులను సంబంధిత అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఎలక్షన్ విధులలో ఆదిత్య డిగ్రీ కళాశాల

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలు



రాజమహేంద్రవరం, నవంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ : స్థానిక రాజమహేం ద్రవరం ఆదిత్య డిగ్రీ కళాశాల నందు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ చేకూరి కీర్తి ఆదేశాల మేరకు డీఎస్వీ స్పెషల్ బ్రాంచ్ రామకృష్ణ మరియు కొప్పూరు డిఎస్వి జి దేవకుమార్ ఆధ్వర్యంలో 100 మంది ఆదిత్య ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ ఎలక్షన్ విధుల్లో సేవలు అందించడానికి ఉదయం 5 గంటల నుంచి వస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆదిత్య డిగ్రీ కళాశాల సెమినార్ హాలు నందు ప్రిన్సిపల్ పి. లక్ష్మీ సరోజ సహకారంతో కొప్పూరు రూరల్ ఎస్సై శ్రీహరిరావు మరియు క్రైమ్ ఎస్సై పి. రవీంద్ర విద్యార్థులు ఏ విధంగా సేవలందించాలో తగిన సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమం ఎన్ఎస్ఎస్ డీన్ డాక్టర్ జి. నాగేశ్వరరావు డాక్టర్ బి. హెచ్. వి. రమాదేవి ఆధ్వర్యంలో జరిగింది. ఇందులో భాగంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ పోలుకొండ సాయి, బి. విమల, ఏపీవో బి. కిరణ్ కుమార్ పాల్గొన్నారు.





ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు

పక్కా ఏర్పాట్లు చేయాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్.మహేష్ కుమార్



అమలాపురం, నవంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ : రెండవ సాధారణ ఎన్నికలు-2026లో భాగంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్. మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పూనేఠా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లు, పోలీసు బందోబస్తు, భద్రతా చర్యలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు తదితర అంశాలపై సమీక్షించారు. అమలాపురంలోని జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ చాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్. మహేష్ కుమార్ సంబంధిత ఎన్నికల అధికారులతో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యదర్శి ఎన్నికల నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్‌ను ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తూ, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లంఘించే వారిపై నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేసి, పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి

పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి

జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకురాలు పి.ప్రశాంతి



అమలాపురం, నవంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ : డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించి పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకురాలు పి. ప్రశాంతి, ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని మలికిపురం మండలం లక్ష్మవరం గ్రామంలో దొడ్డ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లు, పోలింగ్ సిబ్బందికి అవసరమైన సదుపాయాలు, పోలీసు భద్రతా చర్యలు, పోలింగ్ కేంద్రాల్లో టేబుళ్ల ఏర్పాటు తదితర అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకురాలు మాట్లాడుతూ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, సీసీటీవీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేపట్టి ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో సర్వే అండ్ ల్యాండ్స్ ఏడీ డి. ప్రభాకర్ రావు, మలికిపురం తహసీల్దార్ కె. రాజకిషోర్, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

19 జెడ్పీటీసీ, 372 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు - 10,90,975 మంది ఓటర్లు.. 1,294 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

647 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్.. 2,000 మంది పోలీసు సిబ్బంది కోసం ప్రతిపాదనలు : జిల్లా పరిషత్ సీఈఓ వసంత మాధవి

అమలాపురం, నవంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ : డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రెండో సాధారణ జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు-2026 నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అవసరమైన పోలింగ్ సిబ్బంది, ఎన్నికల సామగ్రి, రవాణా, భద్రతా ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) వసంత మాధవి వెల్లడించారు.

జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల వివరాలు:

జిల్లాలో మొత్తం 19 జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. అన్ని 19 స్థానాల్లోనూ పోటీ ఉండగా, 75 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అదేవిధంగా 379 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయగా, 7 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 372 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ స్థానాల్లో మొత్తం 835 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.

10.90 లక్షల మంది ఓటర్లు:

జిల్లాలో మొత్తం 10,90,975 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 5,43,470 మంది పురుషులు, 5,47,489 మంది మహిళలు, 16 మంది ఇతర ఓటర్లు ఉన్నారు.

1,294 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు:

ఎన్నికల నిర్వహణ కోసం జిల్లావ్యాప్తంగా 1,294 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. వీటిలో 258 సున్నితమైన పోలింగ్ కేంద్రాలు, 389 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. 647 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ సదుపాయం కల్పిస్తున్నారు.

ఎన్నికల సిబ్బంది నియామకం:

ఎన్నికల విధుల నిర్వహణకు 22 మంది రిటర్నింగ్ అధికారులు, 40 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, 1,554 మంది ప్రిసైడింగ్ అధికారులు, 7,726 మంది ఇతర పోలింగ్ సిబ్బందిని నియమించారు. అలాగే 64 మంది జోనల్ అధికారులు, 290 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. ఎన్నికల సిబ్బందికి అవసరమైన శిక్షణను పూర్తి చేశారు.

బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రి సిద్ధం:

ఎన్నికల నిర్వహణకు 1,950 పెద్ద బ్యాలెట్ బాక్సులు, 850 మధ్యస్థాయి బ్యాలెట్ బాక్సులు అందుబాటులో ఉంచారు. అవసరమైన ఎన్నికల సామగ్రి సమృద్ధిగా ఉన్నట్లు అధికారులు ధ్రువీకరించారు. ఓటర్లకు ఓటర్ స్లిప్పుల పంపిణీ కూడా పూర్తయింది.

రవాణా, పంపిణీ కేంద్రాల ఏర్పాట్లు:

ఎన్నికల విధుల కోసం మొత్తం 315 వాహనాలను వినియోగించనున్నారు. వీటిలో 198 పెద్ద వాహనాలు, 117 చిన్న వాహనాలు ఉన్నాయి. జిల్లాలో 19 పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

కౌంటింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు:

ఎన్నికల అనంతరం ఓట్ల లెక్కింపు నిర్వహణకు 3 కౌంటింగ్ కేంద్రాలు, 369 కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం 406 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 812 మంది కౌంటింగ్ సిబ్బందిని నియమించారు.

పటిష్టమైన పోలీసు భద్రత:

ఎన్నికల ప్రశాంత నిర్వహణకు పోలీసు శాఖ తరఫున ప్రస్తుతం 750 మంది సిబ్బంది అందుబాటులో ఉన్నారు. వీరిలో 4 మంది డీఎస్పీలు, 12 మంది సీఐలు, 40 మంది ఎస్ఐలు, 170 మంది ఏఎస్ఐలు, 384 మంది కానిస్టేబుళ్లు, 140 మంది ఇతర సిబ్బంది ఉన్నారు. ఎన్నికల భద్రతను మరింత పటిష్టం చేసేందుకు మొత్తం 2,000 మంది పోలీసు సిబ్బంది అవసరమని ప్రతిపాదనలు పంపించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా జిల్లా ఎన్నికల యంత్రాంగం సమన్వయంతో చర్యలు చేపట్టినట్లు జిల్లా పరిషత్ సీఈఓ వసంత మాధవి తెలిపారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు

ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలి

విద్యుత్ పునరుద్ధరణ, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై క్షేత్రస్థాయి పరిశీలన

జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ ఆర్.మహేష్ కుమార్



అమలాపురం, నవంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ : జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, సజావుగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం రాజోలు నియోజకవర్గ పరిధిలోని మలికిపురం మండలంలో ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లు, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలు, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను పరిశీలించారు. మలికిపురం మండలం లక్ష్మవరం గ్రామంలోని దొడ్డా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, పోలింగ్ నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి, ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం గుడిమెల్లంక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, విద్యుత్ సరఫరా పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు, ఎన్నికల విధులో పాల్గొనే సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. మలికిపురం మండలంలోని ఏపీ ఈపీడీసీఎల్ అసిస్టెంట్ ఇంజనీర్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ విద్యుత్ సబ్‌స్టేషన్ల పనితీరు, విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చేపడుతున్న చర్యలపై అధికారులతో సమీక్షించారు. గుడిమెల్లంక గ్రామంలో ఎన్ని ఇళ్లకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు, ఇంకా ఎన్ని ఇళ్లకు విద్యుత్ అందించాల్సి ఉందనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా విద్యుత్ సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించాలని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. మేడిచర్ల గ్రామపంచాయతీ పరిధిలో కూలిపోయిన భారీ వృక్షాన్ని కలెక్టర్ పరిశీలించారు. ప్రజల రాకపోకలకు, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా రహదారిపై అడ్డంకిగా ఉన్న వృక్షాన్ని తక్షణమే తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లతో పాటు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, పాఠశాలల మరమ్మతులు, రహదారులపై అడ్డంకుల తొలగింపు వంటి పనులను సంబంధిత శాఖల సమన్వయంతో చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీ తేజ ఐఏఎస్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ ప్రభాకర్ రావు, మలికిపురం మండల తహసీల్దార్ రాజకిషోర్, ఎంపీడీవోలు, ఎన్నికల సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ స్టేషన్

వెలుపల మాత్రమే మీడియా కవరేజ్ చేయాలి

జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

అమలాపురం, నవంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ : డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నవంబర్ 05వ తేదీన నిర్వహించనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా మీడియా ప్రతినిధులు తమ అక్రిడిటేషన్ కార్డులను చూపించి, సంబంధిత పోలింగ్ స్టేషన్ వెలుపల మాత్రమే మీడియా కవరేజ్ చేయవలసిందిగా సూచించడమైనది. కావున పాత్రికేయులందరూ ఈ విషయాన్ని గమనించి, ఎన్నికల నిబంధనలు మరియు అధికారుల సూచనలను పాటిస్తూ మీడియా కవరేజీ నిర్వహించవలసిందిగా మనవి.

ఏపీపీఎస్సీ గ్రూప్-1 స్కామ్..

ఏపీ, తెలంగాణలో ఈడీ మెరుపుదాడులు

మాజీ ఐపీఎస్ పీఎస్ఆర్ ఆంజనేయులు నివాసంలోనూ సోదాలు

మనీ లాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు



నవంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ : ఏపీపీఎస్సీ గ్రూప్-1 కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఈ ఉదయం నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తోంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఏపీపీఎస్సీ మాజీ కార్యదర్శి, మాజీ ఐపీఎస్ పీఎస్ఆర్ ఆంజనేయులు నివాసంతో పాటు హైదరాబాద్, నికింద్రాబాద్‌లోని పలు ప్రాంతాలు, మంగళగిరి సమీపంలోని హాయ్‌ల్యాండ్ రిసార్ట్ సహా మొత్తం ఏడు చోట్ల ఈ తనిఖీలు జరుగుతున్నాయి. ఆంజనేయులు, క్యామ్‌సైన్ మీడియా, ఇతర ప్రైవేట్ సంస్థల మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలపై ఈడీ అధికారులు దృష్టి సారించారు. గత ప్రభుత్వ హయాంలో 2018లో 169 గ్రూప్-1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. 2020లో మెయిన్స్ పరీక్ష నిర్వహించారు. అయితే, జవాబు పత్రాల మూల్యాంకనంలో భారీగా అక్రమాలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై విచారణ జరిపిన సిట్... మంగళగిరి వద్ద హాయ్‌ల్యాండ్ రిసార్ట్‌లో 84 రోజుల పాటు మూల్యాంకనం చేశారని, అర్హత లేని 66 మందితో జవాబు పత్రాలను దిద్దించారని తన నివేదికలో తేల్చింది. ఈ మూల్యాంకనం కోసం క్యామ్‌సైన్ మీడియాకు రూ.1.14 కోట్లు, ఇతర సంస్థలకు రూ.1.38 కోట్లు చెల్లించినట్లు సిట్ గుర్తించింది. ఈ నివేదిక ఆధారంగా 2025 ఏప్రిల్‌లో పోలీసులు కేసు నమోదు చేయగా, గతంలో పీఎస్ఆర్ ఆంజనేయులు, క్యామ్‌సైన్ మీడియా డైరెక్టర్‌ను అరెస్ట్ చేశారు. సిట్ దర్యాప్తు నివేదిక ఆధారంగానే, ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద కేసు నమోదు చేసి, తాజాగా సోదాలు చేపట్టింది.

మరో నాలుగు నగరాల్లో ఇందిరమ్మ టవర్లు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ : రాష్ట్రంలో మరో నాలుగు నగరాల్లో ఇందిరమ్మ టవర్లు నిర్మించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్, వరంగల్, నల్గొండ, కరీంనగర్ కార్పొరేషన్ల పరిధిలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి రెండు, మూడు రోజుల్లో నోటిఫికేషన్లు ఇవ్వనున్నట్లు చెప్పారు. హైదరాబాద్ తరహాలో అల్పాదాయ కుటుంబాలకు జీ ప్లస్ 5 అంతస్తుల ఇందిరమ్మ టవర్లు నిర్మించనున్నట్లు వివరించారు. మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజాప్రతినిధులతో రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్ అంశాలపై ఇన్‌హౌస్ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా గృహ ప్రవేశాలు జరిగిన ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి సంబరాలు జరపాలని మంత్రి తెలిపారు. 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పేరుతో నిర్వహించే సంబరాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగలేక పోయినప్పటికీ.. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్న మంత్రి పొంగులేటి.. ఇప్పటివరకు రూ.22,500 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్ల కేటాయించగా.. అందులో 2,21,500 గృహ ప్రవేశాలు జరిగాయని.. మరో 1.90 లక్షల గృహాలు వివిధ దశల్లో ఉన్నట్లు వివరించారు. రెండో విడతలో మరో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్ల కేటాయించినట్లు మంత్రి తెలిపారు. హైదరాబాద్ కోర్ అర్బన్‌లలో లక్ష ఎల్ఐజీ ఫ్లాట్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లు, ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

అద్భుతమైన విజయాన్ని అందించిన

తుని ప్రజలకు ఎమ్మెల్యే దివ్య కృతజ్ఞతలు

తుని పట్టణాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతా..

నూతనంగా కూటమి తరుపున ఎన్నికైన చైర్మన్, కౌన్సిలర్లను అభినందించిన ఎమ్మెల్యే




తుని /కోటనందూరు, నవంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ : తుని మున్సిపల్ ఎన్నికలలో అద్భుతమైన విజయాన్ని దించిన తుని ప్రజలకు ఎమ్మెల్యే యనమల దివ్య కృతజ్ఞతలు తెలియజేశారు. అద్భుతమైన విక్టరీ గిఫ్ట్ ఇచ్చిన తుని ఓటర్ల ఆకాంక్షలకు అనుగుణంగా స్మార్ట్ తునిగా, పట్టణాభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతానని ప్రభుత్వ విప్ యనమల దివ్య అన్నారు.శరకణం శ్రీలత అధ్యర్యంలో నూతన కౌన్సిలర్లు తుని కూటమి కార్యాలయంలో శాననసభ్యురాలు యనమల దివ్య ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన పురపాలకుల ఆనందోత్సవాల మధ్య కేక్ కట్ చేసిన యనమల దివ్య పట్టణ రధసారథులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈసందర్భంగా తనపై నమ్మకంతో కూటమి అభ్యర్థులకు ఘనమైన విజయాన్ని అందించిన పట్టణ ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపిన ఆమె ఇప్పటి వరకూ డబల్ ఇంజన్ సర్కార్లో డబల్ స్పీడ్‌తో పట్టణాభివృద్ధి చేసామని ఇప్పుడు కౌన్సిల్ తోడు కావడంతో ట్రిబుల్ ఇంజన్ సర్కార్ హయాంలో తుని పట్టణాన్ని అన్ని సదుపాయాలతో తీర్చిదిద్దుతామన్నారు. చైర్ పర్సన్ శరకణం శ్రీలత మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ప్రభుత్వ విప్ యనమల దివ్య సహా కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే యనమల దివ్య సహాయ, సహకారాలతో కౌన్సిల్ సమిష్టి నిర్ణయాలతో పట్టణాభివృద్ధి మారుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు, సీనియర్ నేత యనమల రాజేష్ టౌన్ టీడీపీ అధ్యక్షురాలు కునుమంచి శోభారాణి సత్యనారాయణ, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు యినుగంటి సత్యనారాయణ, సీనియర్ నేత మోతుకూరి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ఎన్నికల కౌంటింగ్‌లో

అక్రమాలు జరిగాయి

వైసీపీ నేతలు కురసాల కన్నబాబు, దాడిశెట్టి రాజా, ముద్రగడ గిరిబాబు



ప్రత్తిపాడు, నవంబర్ 05, విశ్వం వాయిస్ న్యూస్ : మున్సిపాలిటీ ఎన్నికల కౌంటింగ్‌లో అక్రమాలు జరిగాయని వైసీపీ నేతలు కురసాల కన్నబాబు, దాడిశెట్టి రాజా, ముద్రగడ గిరిబాబు ఆరోపించారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఏలేశ్వరంలో కౌంటింగ్ ప్రశాంతంగా జరుగుతుంటే ఆర్వీవో వచ్చి గజిబిజి చేశారు. 18380 ఓట్లు పోతైతే 11 ఫామ్స్ ఎక్కువ వచ్చాయి. ఇది మాల్ ప్రాక్టీస్. బాధ్యులైన ఆర్వీవో, జెస్సీలను డ్యూటీ నుండి తొలగించాలి. నైతికంగా, సాంకేతికంగా గెలిచింది వైసీపీయే. టీడీపీ అడ్డదారిలో గెలిచినట్లు ప్రకటించారు. 2000 బ్యాలెట్ పేపర్లు ముందే ప్రింట్ చేశారని అనుమానం. ఆర్వీవో ఫోన్ కు టీడీపీ ముద్ర ఉంది. అభ్యర్థుల సంతకం లేకుండానే ఫలితం ప్రకటించారు. సీసీ ఫుటేజ్ ఇవ్వాలి. అధికారులే రాజకీయం చేస్తే ఎలా? మేము సింగిల్ గా పోటీ చేశాం, కూటమి 3 పార్టీలు కుమ్మక్కయ్యాయి. హైకోర్టు, సుప్రీంకోర్టుకు వెళ్తాం. గిరిబాబు ఆర్వీవో అధికారంతో కౌంటింగ్ లో అల్లకల్లోలం సృష్టించారు. వైసీపీ గెలిచినా ఓడినట్లు చేశారు. 21 వార్డులు గెలిస్తే మెజారిటీ వేలల్లో ఉండాలి, 11 ఓట్ల తేడా ఏంలో చెప్పాలి.

కోటనందూరు మండలంలో

జడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికలకు సర్వం సిద్ధం

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీస్ బందోబస్తు





కోటనందూరు, నవంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ : కాకినాడ జిల్లా కోటనందూరు మండలంలో ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలు పారదర్శకంగా జరపడానికి సర్వం సిద్ధం చేసినట్లు రిటర్నింగ్ అధికారి రమణారెడ్డి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పి వెంకట నారాయణ తెలియజేశారు. మండలంలో నేడు జరిగే 14 ఎంపీటీసీ స్థానాలకు 40 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసి 340 మంది సిబ్బందిని ఏర్పాటు చేశామని ఒక్కొక్క పోలింగ్ స్టేషన్లో పీఓ, ఏపీఓ, నలుగురు సహాయ సిబ్బంది ఉంటారని, 14 ఎంపీటీసీ స్థానాలకు 32 మంది పోటీలో ఉన్నారని, 40 పోలింగ్ కేంద్రాలకు గాను రెండు జోన్లు, ఆరు రూట్లుగా విభజించి అధికారులు నియమించామని ఉదయం 7:00 నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందని, ప్రజలందరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలియజేశారు. ఓటర్ల సౌకర్యార్థం ఆయా పోలింగ్ స్టేషన్లో సకల సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఈ సందర్భంగా తెలియజేశారు.

ఎంపీటీసీ జెడ్పిటిసి ఎన్నికలకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు

మండలంలో జరిగే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై టి రామకృష్ణ తెలియజేశారు. ఈ బందోబస్తులో ఒక సీఐ,ఇద్దరు ఎస్సైలు, 60 మంది పోలీస్ కానిస్టేబుల్ 50 మంది ఎస్ఎస్ఎస్ వాలంటీర్లు ఉంటారని ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

సుస్థిర ఆహారపు అలవాట్లతోనే

సంపూర్ణ ఆరోగ్యం

కాకినాడ రోడ్డు రవాణా సంస్థలో ఘనంగా జీవనశైలి వారోత్సవాలు

ఉద్యోగులతో ప్రతిజ్ఞ.. ప్రయాణికులకు ఉచిత వైద్య శిబిరం





కాకినాడ, నవంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన, సంప్రదాయ పౌష్టికాహారపు అలవాట్లను భాగం చేసుకోవాలని కాకినాడ జిల్లా ఉప ప్రజా రవాణా అధికారి కే. రమేష్, స్థానిక రవాణా నిర్వహణాధికారిణి రమ లక్ష్మీదేవి పిలుపునిచ్చారు. బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన మంగళవారం కాకినాడ రవాణా సంస్థ ప్రాంగణంలో "సుస్థిర ఆహార విధానాలను అలవర్చుకుందాం" అనే అంశంపై ఉద్యోగులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వైద్యాధికారిణి వీరలక్ష్మి, ఆయుష్ వైద్యులు మాట్లాడుతూ, నేటి యాంత్రిక జీవనంలో పౌష్టికాహారానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవశ్యకత ఎంతో ఉందన్నారు. శరీరానికి హాని కలిగించే పదార్థాలకు దూరంగా ఉంటూ, తాజా కూరగాయలు, పండ్లు, తీర్థవ్యవస్థకు మేలు చేసే సహజసిద్ధమైన సేంద్రీయ ఆహారాన్ని తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. వేళకు భోజనం చేయడం, నిత్యం శారీరక వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆహారాన్ని వృథా చేయకూడదని స్పష్టం చేశారు.

ఉద్యోగులతో ప్రతిజ్ఞ:

సదస్సు అనంతరం సిబ్బందితో సుస్థిర జీవనశైలి ప్రతిజ్ఞ చేయించారు. నిత్యజీవితంలో పర్యావరణహిత విధానాలను అనుసరిస్తామని, ఆహార వృథాను అరికడతామని ఉద్యోగులందరూ ప్రతినబూనారు.

ఉచిత వైద్య శిబిరం:

వారోత్సవాల సందర్భంగా ప్రయాణ ప్రాంగణంలో ఆయుష్ వైద్య బృందం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రవాణా సంస్థ కార్మికులతో పాటు ప్రయాణికులకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ నిర్వహణాధికారి మాలిమ్ భాష, ఆయుష్ వైద్య బృందం, రవాణా సంస్థ ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తుపాను నష్టంపై ప్రతి రైతుకూ పరిహారం అందేలా చర్యలు

విద్యుత్ పునరుద్ధరణ పనులు సాయంత్రంలోగా పూర్తి చేస్తాం

పల్నాడు జిల్లాలో పంట నష్టాల పరిశీలన - రైతులకు మంత్రి గొట్టిపాటి భరోసా



చిలకలూరిపేట / అద్దంకి, నవంబర్ 05, విశ్వం వాయిస్ న్యూస్ : తుపాను ప్రభావంతో పంటలు దెబ్బతిన్న ప్రతి రైతునూ గుర్తించి, నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అధికారులను ఆదేశించారు. నష్టపోయిన రైతులందరినీ కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. బుధవారం తొలత పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట పరిసర తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే ప్రత్తిపాటితో కలిసి ఆయన పర్యటించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. తుపాను కారణంగా జరిగిన నష్టాన్ని రైతులు మంత్రికి వివరించారు. అర్హులైన ఏ ఒక్క రైతూ నష్టపరిహారం అందకుండా మిగిలిపోకూడదని, క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి పంట నష్టాన్ని నమోదు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం అద్దంకిలో పర్యటించిన మంత్రి.. తుపాను ప్రభావం, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలపై వివరాలు వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందస్తు జాగ్రత్తలు, సమన్వయంతో అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయడం వల్ల ప్రాణనష్టం జరగకుండా పరిస్థితిని ఎదుర్కోగలిగామని తెలిపారు. తుపానుకు రెండు రోజుల ముందే విద్యుత్ సిబ్బందిని, అవసరమైన సామగ్రిని సిద్ధం చేశామని చెప్పారు.

మూడు జిల్లాల్లో విద్యుత్ వ్యవస్థకు నష్టం

తుపాను ప్రభావంతో ప్రకాశం, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో విద్యుత్ వ్యవస్థకు నష్టం వాటిల్లిందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ప్రజలు గత రెండు రోజులుగా విద్యుత్ అంతరాయాలతో ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. సరఫరాను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు కర్ణాటక, తమిళనాడు నుంచి రెండు వేల మందికిపైగా సిబ్బంది వచ్చి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని వెల్లడించారు. ఏపీఎస్పీడీసీఎల్ నుంచి మరో వెయ్యి మంది సిబ్బందిని ప్రకాశం, పల్నాడు జిల్లాలకు పంపినట్లు చెప్పారు. సీఎండీ నుంచి లైన్‌మెన్ వరకు ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో సేవలందిస్తూ పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమయ్యారని వివరించారు. తెగిపడిన విద్యుత్ లైన్లు, దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లను యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బుధవారం సాయంత్రంలోగా విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించే క్రమంలో సిబ్బంది భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన చోట అదనపు సిబ్బంది, సామగ్రిని వినియోగించి పనులను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

బాపట్ల జిల్లాలోనూ తుపాను ప్రభావిత ప్రాంతాల పరిశీలన

అనంతరం మంత్రి గొట్టిపాటి రవి కుమార్ బాపట్ల జిల్లాలో పర్యటించారు. పర్యూరు, చీరాల నియోజకవర్గాల్లో మురను తుపాను ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల పురోగతిని సమీక్షించారు. కర్లుతకలోని గుల్లూర్లా నుంచి వచ్చి సేవలందిస్తున్న విద్యుత్ సిబ్బందిని కలిసి వారి పనితీరును అభినందించారు. చీరాలలో తమిళనాడు నుంచి వచ్చిన విద్యుత్ సిబ్బంది చేపడుతున్న పునరుద్ధరణ పనులను పరిశీలించి వారితో మాట్లాడారు. తుపాను వంటి క్లిష్ట పరిస్థితుల్లో సొంత ప్రాంతాలను విడిచి వచ్చి ప్రజలకు విద్యుత్ సేవలు అందిస్తున్న సిబ్బందికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. వారి సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. తుపాను కారణంగా నష్టపోయిన ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధితులకు అవసరమైన ఆర్థిక సాయం కూడా అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో పర్యూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి

కోటి విరాళం ఇచ్చిన విట్ సంస్థ



అమరావతి, నవంబర్ 05, విశ్వం వాయిస్ న్యూస్ : ముఖ్యమంత్రి సహాయ నిధికి అమరావతిలోని వెల్లూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రూ. 1 కోటి విరాళాన్ని అందజేసింది. ఆ సంస్థ చైర్మన్ జి.విశ్వనాథన్ సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి విరాళాన్ని అందజేశారు. అర్నల్, మురను తుఫాన్ ప్రభావంతో ఏపీ తీవ్రంగా నష్ట పోయిందని... తుపాను బాధితులకు సహకారం అందించేలా వెల్లూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఈ విరాళాన్ని అందిస్తున్నట్లు వివరించారు. విరాళం ఇచ్చిన విట్ ప్రతినిధులను సీఎం చంద్రబాబు అభినందించారు.

వర్షపు నీటిలో చిక్కుకున్న ఎన్నికల సిబ్బందికి

జిల్లా యంత్రాంగం రక్షణ

క్షేత్రస్థాయిలో పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరితో జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్





గోపాలపురం, నవంబర్ 05, విశ్వం వాయిస్ న్యూస్ : నవంబరు 5న జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ఈ కార్యాలయాన్ని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంగా ఏర్పాటు చేశారు. అయితే ఒక్కసారిగా భారీ వర్షపు నీరు చేరడంతో ప్రాంగణం జలమయమై సిబ్బంది బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. సమాచారం అందుకున్న వెంటనే జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టాయి. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ డి.నరసింహ కిశోర్, జాయింట్ కలెక్టర్ వై. మేఘస్వరూప్, అదనపు ఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ స్వయంగా సంఘటనా స్థలానికి చేరుకుని మోకాళ్ల లోతు నీటిలోకి దిగి పరిస్థితిని పర్యవేక్షించారు. లారీలు, భారీ వాహనాలు, ట్రాక్టర్లతో పాటు ఇతర సహాయక వాహనాలను రంగంలోకి దించారు. రాష్ట్ర విపత్తుల స్పందన దళం, అగ్నిమాపక శాఖ, పోలీసు సిబ్బంది సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టారు. అధికారులు, పోలీసులు నీటిలో ఉండి ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఒక్కరినీ సురక్షితంగా వాహనాల్లోకి ఎక్కించి నీటిముంపు ప్రాంతం నుంచి బయటకు తరలించారు. జిల్లా ఉన్నతాధికారులు స్వయంగా వర్షంలోనే సహాయక చర్యలను పర్యవేక్షించడంతో ఎన్నికల సిబ్బంది అంతా సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణాపాయం జరగలేదని అధికారులు తెలిపారు.

ఓటు పండుగకు రాయవరం రెడీ

63 పోలింగ్ కేంద్రాల్లో 52,877 మంది ఓటర్లు.. విధుల్లో 335 మంది సిబ్బంది





రాయవరం, నవంబర్ 05, విశ్వం వాయిస్ న్యూస్ : మండల కేంద్రమైన రాయవరంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి. శేశాంక, సహాయ రిటర్నింగ్ అధికారి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ముల్లపూడి సూర్యనారాయణమ్మ కళావేదిక నుంచి మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రిని పటిష్ట భద్రత నడుమ తరలించారు. మండలంలో మొత్తం 63 పోలింగ్ కేంద్రాల పరిధిలో 52,877 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 25,790 మంది పురుషులు, 27,085 మంది మహిళలు, ఇద్దరు ఇతర ఓటర్లు ఉన్నారు. ఎన్నికల విధుల నిర్వహణ కోసం మొత్తం 335 మంది సిబ్బందిని నియమించారు. వీరిలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బంది పాల్గొననున్నారు. నేడు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగనుంది. ప్రతి పోలింగ్ కేంద్రంలో అధికారుల పర్యవేక్షణలో ఓటింగ్ నిర్వహించడంతో పాటు సీసీ కెమెరాల ద్వారా ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించనున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఆయా గ్రామాల్లో పటిష్ట పోలీసు భద్రత ఏర్పాటు చేశారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. పోలింగ్ ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు.

తొమ్మిది రోజుల ప్రచారానికే తొమ్మిది వేలకు పైగా ఓట్ల ఆదరణ

ప్రజల అభిమానాన్ని ఎప్పటికీ మరిచిపోను - గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రజల్లోనే ఉంటా : డాక్టర్ రాము



మండపేట టౌన్, నవంబర్ 05, విశ్వం వాయిస్ న్యూస్ : మండపేట మున్సిపల్ ఎన్నికల్లో కేవలం తొమ్మిది రోజుల పాటు మాత్రమే ప్రచారం నిర్వహించినప్పటికీ పట్టణ ప్రజలు తొమ్మిది వేలకు పైగా ఓట్లు వేసి తనను ఆదరించడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని మండపేట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చైర్మన్ అభ్యర్థి, ప్రముఖ ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ రాము అన్నారు. తనపై నమ్మకంతో ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ జీవితాంతం రుణపడి ఉంటానని తెలిపారు. బుధవారం మండపేటలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఓటమి విజయానికి నాంది మాత్రమేనని పేర్కొన్నారు. ఎలాంటి అంగబలం, అర్థబలం లేని తనకు మండపేట పంటి ప్రాంతంలో పోటీ చేసే అవకాశం కల్పించిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఎన్నికల ప్రచారానికి తక్కువ సమయం లభించినప్పటికీ ప్రజలు చూపిన ఆదరణ, అభిమానం తనకు ఎంతో ధైర్యాన్నిచ్చాయని అన్నారు. తనకు ఓటు వేసిన వారితో పాటు ఓటు వేయని ప్రజల మనసులను కూడా గెలుచుకునేందుకు కృషి చేస్తానని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు.తాను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని, పార్టీ అధిష్ఠానం సూచనలు, సలహాల మేరకు భవిష్యత్తులో ముందుకు సాగుతానని తెలిపారు. రానున్న రోజుల్లో పట్టణ ప్రజలందరి మన్ననలు పొందుతూ మరింత ప్రజాసేవ చేస్తానని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన 36 మంది కౌన్సిలర్లకు, మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన అజయ్ బాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సమావేశంలో వైసీపీ టౌన్ కన్వీనర్ పిల్లి శ్రీనివాస్, నాయకులు మందపల్లి రవికుమార్, షేక్ గౌస్, జొన్నపల్లి సత్తిబాబు, పోతంశెట్టి ప్రసాద్, సాధనాల శివ భగవాన్, పెంకే గంగాధర్, నాయుడు అయ్యప్ప, మొండి మురళి, సూరంపూడి సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో చేరిన టీడీపీ నాయకుడు బాగాల వెంకటేశ్వరరావు

రాజానగరం, నవంబర్ 05, విశ్వం వాయిస్ న్యూస్ : రాజానగరం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంపై విశ్వాసంతో పార్టీలో చేరుతున్న నాయకులు, కార్యకర్తలకు తగిన గౌరవం, ప్రాధాన్యత కల్పిస్తామని తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బాగాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ విధానాలు, నాయకత్వంపై నమ్మకంతో వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు. పార్టీ అభివృద్ధికి, గ్రామంలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.



తుపాన్ సహాయక చర్యలు వేగంగా చేపట్టండి

ప్రజలకు అసౌకర్యం కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలి

అధికారులకు, ఎన్‌డిఆర్‌ఎఫ్ కమాండెంట్‌కి ఎంపీ పురందేశ్వరి సూచన



రాజమహేంద్రవరం, నవంబర్ 05, విశ్వం వాయిస్ న్యూస్ : మురను తుపాన్ కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు తూర్పుగోదావరి జిల్లాపై ఎక్కువ ప్రభావం ఉన్నందున సహాయక చర్యలు వేగంగా చేపట్టాలని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సూచించారు. ఒడిశా పర్యటనలో ఉన్న ఆమె బుధవారం కలెక్టర్ కీర్తి చేకూరి, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, ఎన్.డి.ఆర్.ఎఫ్. కమాండెంట్ 10వ బెటాలియన్ వివిఎన్ ప్రసన్న కుమార్‌లతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరదలో చిక్కుకున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. గోపాలపురం, కొవ్వూరు, నిడదవోలు రాజానగరం నియోజక వర్గాలపై మురను తుపాన్ అధిక ప్రభావం చూపిందని, ఇలాంటి కష్ట సమయంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఇప్పటికే అర్నాట్ తుపాన్ కారణంగా జిల్లాలో పలు నియోజక వర్గాల్లో పంటలు దెబ్బతిన్నాయని, ఇప్పుడు మురను తుపాన్ కారణంగా మరింత ప్రభావం గోరుచుట్టుపై రోకలి పాటుగా మారిందని ఎంపీ పురందేశ్వరి విచారం వ్యక్తంచేసారు. తుపాన్ల కారణంగా జరిగిన నష్టం గురించి కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని ఆమె పేర్కొన్నారు.

మండలంలో ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

ఎన్నికల విధులకు 456మంది సిబ్బంది : ఆర్వో శ్రీనివాసరావు

మూడు జోన్లు,ఐదు రూట్లలో పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది



కోరుకొండ, నవంబర్ 05, విశ్వం వాయిస్ న్యూస్ : మండలంలోని నేడు నిర్వహించనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు 456మంది సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్లినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి డీ శ్రీనివాసరావు తెలిపారు.బుధవారం చెరుకూరి విద్యాలయం నుంచి మూడు జోన్లు, ఐదు రూట్లుగా సిబ్బందిని విభజించి, అవసరమైన ఎన్నికల సామగ్రితో ప్రత్యేక ఏర్పాట్ల మధ్య తరలింపు చర్యలు చేపట్టమన్నారు. ప్రతి బృందానికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలు,రూట్ల వివరాలను పరిశీలిస్తూ సిబ్బంది సకాలంలో తమ గమ్యస్థానాలకు చేరుకునేలా తగిన చర్యలు చేపట్టమ న్నారు.ఎన్నికల సామగ్రి పంపిణీ, సిబ్బంది కేటాయింపు, రవాణా ఏర్పాట్లను సమన్వయం చేశారు.పోలింగ్ సిబ్బంది తమ కేంద్రాలకు అనంతరం అక్కడ అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసుకుని, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం గురువారం ఉదయం నిర్దిష్ట సమయానికి పోలింగ్ ప్రారంభమయ్యేలా సిద్ధంగా ఉండాలని అధికారులు సూచించారు. ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా సమన్వయంతో పనిచేయాలని శ్రీనివాసరావు తెలిపారు.ఈ కార్యక్రమం లో ఆర్వో శ్రీనివాసరావు, ఎన్నికల సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీపీ ఎంపీపీగా అభ్యర్థి వరద రాజరాజేశ్వరి రానినే

ఎంపీపీపై వదంతులు నమ్మొద్దు





కోరుకొండ, నవంబర్ 05, విశ్వం వాయిస్ న్యూస్ : కోరుకొండ మండల ఎన్డీఏ(జనసేన) ఎంపీపీ అభ్యర్థిగా బూరుగుపూడి గ్రామానికి చెందిన వరద రాజరాజేశ్వరి రానినే పోటీలో ఉన్నారని ఎన్డీఏ నాయకులు కంటే నాగ కేశవరావు అడపా శ్రీనివాస్ తెలిపారు. బుధవారం బూరుగుపూడి లో పాత్రికేయులతో మాట్లాడుతూ ఎన్డీఏ ఎంపీపీ అభ్యర్థిని మారుస్తున్నారంటూ వదంతులు షికారు చేస్తున్నాయని, అవన్నీ వాస్తవం కాదన్నారు. రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు రాజమహేంద్రవరం రురల్ చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి ముందుగా ప్రకటించినట్టుగానే, రాజరాజేశ్వరి రాణి అఖండ మెజార్టీతో విజయం సాధించి, కోరుకొండ మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలుగా పీఠాన్ని అధిరోహిస్తారని ధీమా వ్యక్తం చేశారు. బూరుగుపూడి గ్రామానికి 15 ఏళ్ల తర్వాత ప్రాదేశిక ఎన్నికలు జరుగుతున్నాయని, అటువంటి తరుణంలో పార్టీలకు, కులాలకు అతీతంగా గ్రామస్తులంతా ఏకమై రాజరాజేశ్వరి రానిని గెలిపించుకొని, తమ గ్రామానికి ఎంపీపీ దక్కించుకోవడానికి అందరూ సహకరించాల న్నారు. తద్వారా గ్రామాభివృద్ధి, గ్రామానికి మంచి పేరు ప్రభ్యాతులు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు కంటే నాగ కేశవరావు, అడపా శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.



అది రెండో ప్రపంచ యుద్ధం నాటి వస్త్రం..

ప్రపంచం మొత్తంలో ఐదే ఉన్నాయి..



పవన్ కళ్యాణ్ నటించిన బాలు చిత్రంలో ఆయన ధరించిన ప్యాంట్ల ధర గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు సీనియర్ హీరోయిన్ రేణు దేశాయ్. వెల్లడించారు. రెండో ప్రపంచ యుద్ధ కాలం నాటి అరుదైన బట్టతో తయారుచేసిన ఈ ప్యాంట్లు కేవలం ఐదు మాత్రమే ఉన్నాయని, వాటిలో ఒకటి పవన్ కళ్యాణ్ కోసం ప్రత్యేకంగా రూపొందించారని ఆమె తెలిపారు. ప్రస్తుతం ఆమె చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినీ కెరీర్‌లో ఎన్నో సూపర్ హిట్ చిత్రాలు ఉన్నాయి. అందులో బాలు సినిమా ఒక ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. ఈ మూవీ అప్పట్లో బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. అంతేకాదు ఈ చిత్రంలోని సాంగ్స్, పవన్ కళ్యాణ్ మేనరిజం, స్టైల్ అప్పట్లో స్పెషల్ అట్రాక్షన్ అయ్యాయి. ఎంతగా అంటే అప్పటి యూత్ స్వయంగా బాలు స్టైల్ ఫాల అయ్యేంతగా. ఇక ఈ సినిమాలో పవన్ కళ్యాణ్ ధరించిన ప్యాంట్.. అప్పట్లో ఆ స్టైల్లో వచ్చిన దుస్తులు చేసిన సెన్సేషన్ గురించి చెప్పక్కర్లేదు. ఈ సినిమాలో ఆయన ధరించిన దుస్తులు, ముఖ్యంగా ప్యాంట్లు, అప్పట్లో అభిమానులను తెగ ఆకట్టుకున్నాయి. తాజాగా సీనియర్ హీరోయిన్ రేణు దేశాయ్, ఈ ప్యాంట్ల వెనుక ఉన్న ఆసక్తికరమైన కథ , వాటి ధరను వెల్లడించి అందరినీ ఆశ్చర్యపరిచారు. అప్పట్లో రేణు దేశాయ్ పవన్ సినిమాలకు కాస్ట్యూమ్ డిజైనర్ గా వర్క్ చేశారు. రేణు దేశాయ్ మాట్లాడుతూ.. బాలు సినిమాలో ఫునీ పాత్ర కోసం కాస్ట్యూమ్స్ కోసం ఎంతో ప్రయత్నం చేశాను. ముఖ్యంగా ఆ సినిమాలో పవన్ కళ్యాణ్ గారు ధరించిన ప్యాంట్లు మామూలివి కావు. అవి రెండో ప్రపంచ యుద్ధం కాలం నాటి నిజమైన బట్టతో ప్రత్యేకంగా తయారు చేయబడినవి. ఈ బట్ట అరుదైనది కావడంతో, ప్యాంట్లను తయారు చేయించడానికి అడ్వాన్స్ చెల్లించి, మూడు నెలల తర్వాత వాటిని తీసుకోవాల్సి వచ్చిందని రేణు దేశాయ్ వివరించారు. ఇటలీకి చెందిన ప్రముఖ హాలీవుడ్ కాస్ట్యూమ్ డిజైనర్ చేతుల మీదుగా ప్రత్యేక శ్రద్ధతో ఈ ప్యాంట్ ను డిజైన్ చేయించానని అన్నారు. అప్పట్లో అలాంటి ప్యాంట్లు ప్రపంచవ్యాప్తంగా కేవలం ఐదు మాత్రమే తయారు చేయబడ్డాయని, వాటిలో ఒకటి ప్రముఖ ఫుట్‌బాల్ క్రీడాకారుడు డేవిడ్ బెక్కంకి వెళ్లిందని, ఒకటి పవన్ కళ్యాణ్ కోసం తీసుకున్నామని ఆమె పేర్కొన్నారు. ఈ అరుదైన , నాణ్యమైన ప్యాంట్ల ధర ఆ సమయంలో రూ. 75,000 ఉందని అన్నారు. ఆ రోజుల్లో ఇంత పెద్ద మొత్తం పెట్టి ఒక దుస్తుల వస్తువు కొనడం సాధారణ విషయం కాదని, ఇది సినిమాపై , పాత్రపై మేకర్స్ చూపిన అంకితభావాన్ని తెలియజేస్తుందని రేణు దేశాయ్ అభిప్రాయపడ్డారు. అయితే ఈ సినిమాకు అంత భారీ మొత్తాన్ని భరించడానికి చిత్ర నిర్మాత అశ్వినీదత్ సిద్ధంగా ఉన్నప్పటికీ పవన్ కళ్యాణ్ నిరాకరించి తన సొంత ఖర్చుతోనే దానిని రూపొందించుకున్నారని అన్నారు. ప్రస్తుతం ఆమె చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి.



మహంతి ఝాన్సీ రాణి అనే నేను..

నాగార్జున కింగ్ 100 నుంచి టబు గ్లింప్స్ రిలీజ్..

అక్కినేని నాగార్జున ప్రధాన పాత్రలో నటిస్తున్న వందో సినిమా కింగ్ 100. డైరెక్టర్ రా.కార్తీక్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్ పై ఇప్పటికే మంచి క్యూరియాసిటీ నెలకొంది. ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు. ఇందులో టబు కీలకపాత్ర పోషిస్తుండగా.. డిసెంబర్ 24న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నారు. ఈ క్రమంలోనే తాజాగా టబు పాత్రకు సంబంధించిన గ్లింప్స్ రిలీజ్ చేసింది చిత్రయూనిట్. టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న వందో సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. డైరెక్టర్ రా. కార్తీక్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి తాత్కాలికంగా 'కింగ్ 100' అనే వర్కింగ్ టైటిల్‌ను ఖరారు చేశారు. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై ఈ సినిమా అత్యంత గ్రాండ్‌గా తెరకెక్కుతోంది. కాగా ఈ చిత్రంలో ప్రముఖ నటి టబు ఒక కీలక పాత్రలో నటిస్తుండగా, ఆమెకు సంబంధించిన స్పెషల్ అప్‌డేట్ రిలీజ్ చేశారు మేకర్స్. తాజాగా ఈ గ్లింప్స్ సినీ ప్రియులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. మంగళవారం నాడు నటి టబు పుట్టినరోజు సందర్భంగా చిత్ర యూనిట్ ఈ సినిమా నుంచి ఆమె పాత్రకు సంబంధించిన ప్రత్యేక గ్లింప్స్‌ను అధికారికంగా విడుదల చేసింది. ఈ గ్లింప్స్‌లో టబు లుక్, ఆమె చెప్పిన పవర్‌ఫుల్ డైలాగ్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా తారాస్థాయికి చేర్చింది. గ్లింప్స్‌లో భాగంగా టబు చెప్పిన, "మనుషుల్లో రెండు రకాలు.. కష్టాన్ని నమ్మేవాళ్లు, అదృష్టాన్ని నమ్మేవాళ్లు. మహంతి ఝాన్సీ రాణి అనే నేను.." అనే డైలాగ్ సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ఈ చిత్రంలో టబు పాత్ర ఎంతో పవర్‌ఫుల్‌గా, వైవిధ్యమైన షేడ్స్‌తో ఉండబోతున్నట్లు ఈ గ్లింప్స్ స్పష్టం చేస్తోంది. నాగార్జున కెరీర్‌లోనే లాండ్‌మార్క్ మూవీగా వస్తున్న ఈ ప్రాజెక్ట్‌లో భారీ తారాగణం నటిస్తోంది. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకుని ఈ సినిమాను రాబోయే డిసెంబరు 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. నాగ్ కెరీర్ మైలురాయిగా నిలవనున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి. ఇదిలా ఉంటే.. దాదాపు 27 ఏళ్ల తర్వాత వీరిద్దరి కాంబో రిపీట్ కాబోతుంది. ఒకప్పుడు వీరి జోడీకి స్పెషల్ ఫ్యాన్ బేస్ ఉండేది. అప్పట్లో నాగ్, టబు కలిసి నటించిన నిన్నే పెళ్లాడతా, ఆవిడా మా ఆవిడే చిత్రాలు సూపర్ హిట్ అయ్యాయి. అలాగే సిసింద్రీ చిత్రంలో టబు స్పెషల్ సాంగ్ చేసిన సంగతి తెలిసిందే. ఇక ఇప్పుడు చాలా కాలం తర్వాత వీరి కాంబో వస్తుండడంతో ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు.



పరుగులు చేయకపోయిన మ్యాచ్‌ను

గెలిపించింది మాత్రం రోహితే



న్యూజిలాండ్‌తో తొలి వన్డేలో రోహిత్ శర్మ పరుగులేమీ చేయకుండానే ఔటయ్యాడు. అయినా భారత్ విజయంలో అతడి పాత్ర కీలకమని కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ప్రశంసించాడు. ధారి మిచెల్‌ను రోహిత్ అద్భుతంగా రనౌట్ చేయడం మ్యాచ్‌ను మలుపు తిప్పిందని చెప్పాడు. న్యూజిలాండ్‌తో అక్లాండ్‌లో జరిగిన తొలి వన్డేలో టీమిండియా ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో రోహిత్ శర్మ బ్యాటింగ్‌లో నిరాశపరిచాడు. కైల్ జేమీసన్ బౌలింగ్‌లో పరుగులు ఏమీ తెరవకుండానే పెవిలియన్ బాట పట్టాడు. అయితే బ్యాటింగ్‌లో విఫలమైనా ఫీల్డింగ్‌లో మాత్రం జట్టుకు కీలకంగా మారాడు. ముఖ్యంగా ధారిల్ మిచెల్‌ను రనౌట్ చేసిన తీరు మ్యాచ్‌ను మలుపు తిప్పింది. మ్యాచ్ అనంతరం కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా రోహిత్ ప్రదర్శనను ప్రత్యేకంగా ప్రస్తావించాడు.

రోహిత్ రనౌట్‌తో మారిన మ్యాచ్ పరిస్థితి

న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 22వ ఓవర్‌లో ఈ కీలక ఘటన చోటుచేసుకుంది. అక్షర్ పటేల్ వేసిన బంతిని గ్లెన్ ఫిలిప్స్ లెగ్ సైడ్ వైపు ఆడి సింగిల్ కోసం ప్రయత్నించాడు. అయితే నాన్‌స్ట్రైకర్ ఎండ్‌లో ఉన్న ధారిల్ మిచెల్, ఫిలిప్స్ మధ్య సమన్వయం కుదరలేదు. ఈ గందరగోళాన్ని రోహిత్ శర్మ వెంటనే గుర్తించాడు. బంతిని అందుకున్న అతడు వికెట్ కీపర్ కేఎల్ రాహుల్ వైపు అందర్ ఆర్మ్ త్రో విసిరాడు. రాహుల్ వేగంగా బెయిల్స్ పడగొట్టడంతో క్రీజు బయట ఉన్న మిచెల్ రనౌట్ అయ్యాడు. అప్పటికే ప్రమాదకరంగా మారుతున్న మిచెల్, ఫిలిప్స్ భాగస్వామ్యానికి దీంతో తెరపడింది.

రోహిత్ రనౌట్ మ్యాచ్ టర్నింగ్ పాయింట్

మ్యాచ్ తర్వాత శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ.. భారత బౌలింగ్‌తో పాటు ఫీల్డింగ్ కూడా అద్భుతంగా ఉందని చెప్పాడు. ముఖ్యంగా రోహిత్ వేసిన రనౌట్ మ్యాచ్ ను మార్చిందని అభిప్రాయపడ్డాడు. మిచెల్, ఫిలిప్స్ భాగస్వామ్య ప్రమాదకరంగా మారుతోందని, భారత్‌కోసం వీరిద్దరూ మంచి బ్యాటింగ్ చేశారని గుర్తుచేశాడు. అలాంటి సమయంలో రోహిత్ చురుకైన ఫీల్డింగ్‌తో కీలక వికెట్ అందించాడని ప్రశంసించాడు. అందుకే సున్నా పరుగులకే పెవిలియన్ రోహిత్‌కు గిల్ గెలుపు క్రెడిట్ ఇచ్చాడు.

కాంబోజ్ బౌలింగ్‌పై కెప్టెన్ ప్రశంసలు

ఈ మ్యాచ్‌లో ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచిన అన్షుల్ కాంబోజ్‌ను కూడా గిల్ అభినందించాడు. ఇలాంటి పిచ్‌లపై కాంబోజ్ బౌలింగ్ చాలా ఉపయోగపడుతుందని చెప్పాడు. అతడు వేగంగా బంతులు వేయడంతో పాటు సీమ్ కదలికను రాబట్టగలడని వివరించాడు. పిచ్ నుంచి పెద్ద సహకారం లభించని సమయంలోనూ అదనపు బౌన్స్ రాబట్టడం అతడి ప్రత్యేకతగా పేర్కొన్నాడు. ఈ మ్యాచ్‌లో కాంబోజ్ 10 ఓవర్లలో 22 పరుగులు మాత్రమే ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. అతడి పొదుపైన బౌలింగ్ న్యూజిలాండ్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేయడంలో కీలకమైంది.

కోహ్లీ హాఫ్ సెంచరీతో భారత్‌కు విజయం

తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 40.2 ఓవర్లలో 185 పరుగులకు ఆలౌటైంది. టిమ్ సీఫర్ట్ 38, గ్లెన్ ఫిలిప్స్ 30 పరుగులు చేశారు. చివర్లో బ్లెయిర్ టిక్నర్ 23 బంతుల్లో 34 పరుగులు చేసి జట్టుకు కొంత ఊరటనిచ్చాడు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ నాలుగు, గుర్నూర్ బ్రార్ మూడు, అన్షుల్ కాంబోజ్ రెండు వికెట్లు తీశారు. వర్షం కారణంగా భారత్ లక్ష్యాన్ని 32 ఓవర్లలో 143 పరుగులుగా నిర్ణయించారు. ఛేదనలో కోహ్లీ 51 బంతుల్లో 74 పరుగులు చేయగా, గిల్‌తో కలిసి రెండో వికెట్‌కు 113 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. చివరకు భారత్ 22.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని అందుకుంది.

134 సార్లు 50 ప్లస్ స్కోర్లు..

సచిన్ మరో రికార్డును బ్రేక్ చేసిన విరాట్ కోహ్లీ



న్యూజిలాండ్‌తో అక్లాండ్‌లో జరిగిన తొలి వన్డేలో విరాట్ కోహ్లీ 74 పరుగులతో అదరగొట్టాడు. ఈ ఇన్నింగ్స్‌తో యావత్ దేశాలపై అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధికసార్లు 50కి పైగా స్కోర్లు చేసిన ఆటగాడిగా నిలిచాడు. సచిన్ టెండూల్కర్ రికార్డును అధిగమించి 134 సార్లు ఈ ఘనత సాధించాడు. విరాట్ కోహ్లీ మైదానంలో నిలదొక్కుకుంటే రికార్డులు బద్దలవ్వాల్సిందే. న్యూజిలాండ్‌తో అక్లాండ్‌లో జరిగిన తొలి వన్డేలోనూ ఇదే జరిగింది. వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌లో కోహ్లీ 51 బంతుల్లో 74 పరుగులు చేశాడు. ఇందులో 13 ఫోర్లు, ఒక సిక్సర్ ఉన్నాయి. అతడి ఇన్నింగ్స్‌తో భారత్ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో కోహ్లీ వన్డే కెరీర్‌లో 80వ హాఫ్ సెంచరీని కూడా పూర్తి చేసుకున్నాడు. అయితే ఈ ఇన్నింగ్స్‌తో అతడు సాధించిన మరో ఘనత ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది.

ఎస్ఇఎన్ఎ దేశాలపై సచిన్ రికార్డు

సౌతాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా దేశాలను కలిపి ఎస్ఇఎన్ఎ దేశాలుగా పిలుస్తారు. ఈ జట్లపై అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధికసార్లు 50కి పైగా పరుగులు చేసిన ఆటగాడిగా కోహ్లీ నిలిచాడు. ఇప్పటివరకు ఈ రికార్డు సచిన్ టెండూల్కర్ పేరిట ఉండేది. సచిన్ 320 మ్యాచ్‌ల్లో 133 సార్లు 50కి పైగా స్కోర్లు సాధించగా, కోహ్లీ 320 మ్యాచ్‌ల్లోనే 134 సార్లు ఈ ఘనత అందుకున్నాడు. ఇందులో కోహ్లీ 89 అర్ధ సెంచరీలు, 45 సెంచరీలు సాధించాడు. సచిన్ ఖాతాలో 83 హాఫ్ సెంచరీలు, 50 సెంచరీలు ఉన్నాయి.

టాప్ 10 జాబితాలో దిగ్గజాలు

ఎస్ఇఎన్ఎ దేశాలపై అత్యధిక 50 ప్లస్ స్కోర్లు సాధించిన ఆటగాళ్ల జాబితాలో కోహ్లీ మొదటి స్థానానికి చేరాడు. సచిన్ 133 స్కోర్లతో రెండో స్థానంలో ఉన్నాడు. వెస్టిండీస్ దిగ్గజం బ్రయాన్ లారా 100 స్కోర్లతో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. శ్రీలంక ఆటగాళ్లు కుమార సంగక్కర 97, మహేల జయవర్ధనే 87 స్కోర్లతో జాబితాలో ఉన్నారు. రాహుల్ ద్రవిడ్ 89, శివనారాయణ్ చంద్రపాల్ 89 స్కోర్లతో తర్వాతి స్థానాల్లో నిలిచారు. పాకిస్థాన్ ఆటగాడు బాబర్ ఆజమ్ 83 సార్లు 50కి పైగా పరుగులు చేసి తొమ్మిదో స్థానంలో ఉన్నాడు. ఈ జాబితాలో కోహ్లీ అగ్రస్థానానికి చేరడం అతడి స్థిరమైన ఆటతీరుకు నిదర్శనం.

ఛేజింగ్‌లోనూ సచిన్‌ను దాటిన విరాట్

కేవలం ఎస్ఇఎన్ఎ రికార్డుతోనే కోహ్లీ ఆగలేదు. వన్డేల్లో లక్ష్య ఛేదన సమయంలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా కూడా సచిన్‌ను వెనక్కి నెట్టాడు. ఛేజింగ్‌లో కోహ్లీ ఇప్పటివరకు 8,741 పరుగులు సాధించగా, సచిన్ 8,720 పరుగులు చేశాడు. కోహ్లీ ఈ పరుగులను 66.21 సగటుతో, 95.03 స్ట్రైక్ రేట్‌తో సాధించాడు. సచిన్ సగటు 42.33, స్ట్రైక్ రేట్ 88.44గా ఉంది. దీంతో లక్ష్య ఛేదనలో కోహ్లీ ఆధిపత్యం మరోసారి స్పష్టమైంది.

నంబర్ 3లో 13 వేల పరుగుల మైలురాయి

వన్డేల్లో మూడో స్థానంలో బ్యాటింగ్ చేస్తూ 13 వేల పరుగులు పూర్తి చేసిన తొలి ఆటగాడిగా కోహ్లీ మరో ఘనత సాధించాడు. ఈ స్థానంలో అతడి పరుగులు 13,000 మార్కును దాటాయి. మరోవైపు న్యూజిలాండ్‌పై వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలోనూ కోహ్లీ రికీ పాంటింగ్‌తో సమానంగా నిలిచాడు. ఇద్దరూ 1,971 పరుగులు సాధించారు. టెస్టు, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన కోహ్లీ ప్రస్తుతం వన్డేల్లో కొనసాగుతున్నాడు. ఈ ఫార్మాట్‌లోనూ రికార్డుల వేట కొనసాగిస్తూ అభిమానులను అలరిస్తున్నాడు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్థ వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్థ వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com